RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 171 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం,డిసెంబర్,28,2025 | పేజీలు : 8  వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 171 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday,December,28,2025 | PAGES : 8  RS : 4 /- |



## థాయ్‌ల్యాండ్, కంబోడియా మధ్య
# కాల్పుల విరమణ ఒప్పందం

చాంతబురి: థాయ్‌ల్యాండ్, కంబోడియా దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. రెండు దేశాలకు చెందిన రక్షణ మంత్రులు ఇవాళ దీనిపై సంయుక్త ప్రకటన చేశారు. కంబోడియా రక్షణ మంత్రి టీ సేహ, థాయ్‌ల్యాండ్ మంత్రి నట్టఫోన్ నర్కఫనిట్ కాల్పుల విమరణ ఒప్పందంపై సంతకాలు చేశారు. థాయ్‌లోని చాంతబురి ప్రావిన్సులో ఇద్దరు మంత్రుల మీటింగ్ జరిగింది. సైనిక బలగాల కదలికలపై రెండు దేశాలు తక్షణ ఆంక్షలు విధించాయి. బోర్డర్ వద్ద ఉన్న సాధారణ పౌరులు స్వంత ఇండ్లకు చేరుకునే అవకాశంకల్పించారు. గత కొన్నాళ్ల నుంచి థాయ్, కంబోడియా బోర్డర్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే.బోర్డర్ కాల్పుల్లో సుమారు 41 మంది మరణించారు. లక్షల సంఖ్యలో జనం తరలి వెళ్లారు. శనివారం మధ్యాహ్నం నుంచి కాల్పుల విరమణ అమలులోకి రానున్నది. థాయ్‌ల్యాండ్ ఆధీనంలో ఉన్న 18 మంది కంబోడియా సైనికులను త్వరలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజుల పాటు జరిగిన చర్చల ఫలితంగా థాయ్, కంబోడియా మధ్య ఒప్పందం కుదిరింది.



## పంచాయితీ ఎన్నికలు క్వార్టర్
# మాత్రమే

- సెమీ ఫైనల్ ఫైనల్ ఎన్నికలు ముందున్నయ్
- పంచాయితీలకు మీ అబ్బ సొమ్ము ఇవ్వడం లేదు
- రెండేళ్లలో గ్రామాలను పడావు పెట్టిన ఘనత రేవంత్‌ది
- మళ్లీ కెసిఆర్ సిఎం కావాలన్నదే జనం మాట
- ఒక్క భాషలో తిడితే..మూడు భాషల్లో తిడుతా
- మహబూబాబాద్ సర్పంచ్‌ల సభలో కెటిఆర్ ఎదురుదాడి

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్.. ఈ పేరు కేవలం ఒక నగరానికి మాత్రమే పరిమితం కాదు. ఇది చరిత్ర, సంస్కృతి, ఆధునికత కలగలిసిన ఒక మహా సామ్రాజ్యం. ఒకప్పుడు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ గా ఉన్న ఈ నగరం, 2007లో 'గ్రేటర్' గా అవతరించింది. ఇప్పుడు ఆ గ్రేటర్ సరిహద్దులను కూడా చెరిపేస్తూ, ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి, దేశంలోనే అతిపెద్ద మెగా సిటీలలో ఒకటిగా అవతరించేందుకు సిద్ధమైంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన వార్డుల పునర్విభజన తుది గెజిట్ నోటిఫికేషన్, హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలవనుంది. నిన్నటి వరకు 150 వార్డులకే పరిమితమైన జీహెచ్ఎంసీ పాలన, ఇప్పుడు రెండింతలై 300 వార్డులకు విస్తరించింది.



## పాక్‌తో అప్రమత్తంగా..
# ఉండాల్సిందే

- పాక్ సైనిక వ్యూహాలను తేలికగా తీసుకోరాదు
- కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, డిసెంబర్27 : కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ తరవాత మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వచ్చిందన్నారు. పాక్‌ను తక్కువ అంచనా వేయకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాగే దానిని నమ్మడానికి లేదన్నారు. పాకిస్థాన్‌లో మారుతున్న సైనిక వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థలను.. భారత్ తేలిగ్గా తీసుకోకూడదని హెచ్చరించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు.



- అకున్ సబర్వాల్‌ను తిరిగి నియమించండి
- మాజీ సిఎస్ సోమేశ్ కుమార్‌ను విచారించండి
- రాష్ట్రం తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం

## డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం
# ఎందుకు?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితమవుతున్నారని ఆక్షేపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేరకు డ్రగ్స్ కేసులపై బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పండుగల అప్పుడే డ్రగ్స్ కేసులు నమోదు చేస్తారా? అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో నాటి డ్రగ్స్ కేసు విచారణ ఏమైంది..? అని నిలదీశారు.

అనేకమంది సెలబ్రిటీల పేర్లు బయటకు వచ్చాయి కదా..? ఏం చేశారని ప్రశ్నించారు. తమతోపాటు కేసీఆర్ కుటుంబ సభ్యులు కూడా డ్రగ్స్ తీసుకున్నారని..గతంలో నిందితులు వాంగ్మూలం ఇచ్చారు కదా అని గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు బండి సంజయ్. నిందితుల వాంగ్మూలం ఆడియో, వీడియో రికార్డు చేశారని తెలిపారు. తమ కుటుంబ సభ్యుల భవిష్యత్ నాశనమవుతుందనే భయంతోనే.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ కేసు నీరుగార్చారని ఆరోపించారు.



## ఆరెస్సెస్, బీజేపీ సంస్థాగత బలంపై..
# దిగ్విజయ్ సింగ్ ప్రశంసలు

- వివాదం చెలరేగడంతో వెంటనే మాట మార్చిన కాంగ్రెస్ నేత
- మోదీ ఎదుగుదలను ఉదాహరణగా చూపుతూ పాత ఫొటోతో ట్వీట్
- తాను వారి విధానాలకు వ్యతిరేకినని, సంస్థను మాత్రమే పొగిడానని స్పష్టీకరణ
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం వేళ ఈ వ్యాఖ్యలు చేయడంపై చర్చ

ఢిల్లీ:కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్ సింగ్.. బీజేపీ, ఆరెస్సెస్ లపై చేసిన ప్రశంసలు రాజకీయ దుమారం రేపాయి. దీంతో ఆయన వెంటనే యూ-టర్న్ తీసుకున్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, తాను కేవలం వారి సంస్థాగత బలాన్ని మాత్రమే మెచ్చుకున్నానని వివరణ ఇచ్చారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీతో కలిసి ఉన్న 1996 నాటి ఫొటోను దిగ్విజయ్ సింగ్ 'ఎక్స్'లో పంచుకున్నారు. "ఆరెస్సెస్ స్వయంసేవకులు, జనసంఘ్ కార్యకర్తలు ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి స్థాయికి ఎదగడం వారి సంస్థాగత శక్తికి నిదర్శనం... అద్వానీ కాళ్ల వద్ద కూర్చున్న నేత ఇవాళ ప్రధానిగా ఉన్నారు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.



## రాజకీయంగా యాక్టివ్ అయ్యేందుకు
# ప్రయత్నిస్తున్న కేసీఆర్

-కేసుల నోటీసుల్ని బట్టే బహిరంగసభల తేదీలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ రాజకీయంగా యాక్టివ్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. పదిహేను రోజుల్లో మూడు బహిరంగసభలు పెడతామని అంటున్నారు. ఇలా చెప్పి వారం అవుతోంది కానీ ఇప్పటి వరకూ ఒక్క బహిరంగసభ తేదీని ఖరారు చేయలేదు. ఎక్కడ పెట్టాలో కూడా నిర్ణయించలేదు. కానీ కేసీఆర్ మాత్రం సమావేశాల పేరుతో హడావుడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అసలు లేని ఇష్యూను తెరపైకి తెచ్చి రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. కృష్ణ నీటి విషయంలో కొత్తగా ఎలాంటి డెలవప్‌మెంట్స్ లేకపోయినా ఎప్పుడో జరిగిపోయిన వాటితో హడావుడి చేస్తున్నారు. ఇదంతా ఎందుకు అన్న సందేహం చాలా మందికి వస్తున్నా.. సమాధానాలు మాత్రం ఇప్పుడే మెల్లమెల్లగా తెలుస్తున్నాయి. **ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఖాయమని ప్రచారం:**ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ దాదాపుగా పూర్తయిందనుకున్న దశలో తెలంగాణ ప్రభుత్వం అనూహ్యగా సీనియర్ ఐపీఎస్ సజ్జనార్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. ఏమీ దొరకక సిట్ ను ఏర్పాటు చేసిందని అనుకున్నారు.కానీ పెద్ద స్థాయి వ్యక్తులను విచారణకు పిలవాలన్నా..అరెస్టులు చేయాలన్నా ఆ స్థాయి అధికారులు ఉండాలన్న ఉద్దేశంతో సజ్జనార్‌కు అవకాశం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఆయన కూడా సీరియస్ గానే ఉన్నానని సంకేతాలు పంపుతున్నారు. గతంలో ప్రభుత్వంలో ఉన్నప్పుడు కేసీఆర్, కేటీఆర్ లతో సన్నిహితంగా ఉన్నా.. ఇప్పుడు మాత్రం అలాంటిదేమీ గుర్తుండనట్లుగా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ విషయం కేసీఆర్ గుర్తు పట్టేశారని అందుకే ప్రజల్లోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అంటున్నారు. **నోటీసుల్ని బట్టే బహిరంగసభల తేదీలు?:** పదిహేను రోజుల్లో బహిరంగసభలు అని కేసీఆర్ ప్రకటించినప్పటికీ ఆ తేదీలు.. ట్యాపింగ్ కేసులో సిట్ నుంచి వచ్చే నోటీసుల్ని బట్టి ఉంటాయని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి.

**నాగర్ కర్నూల్,తెలంగాణ దిశ :** మెడికల్ కాలేజీకి 40 ఎకరాల దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కాంట్రాక్టర్లకు అడ్వాన్స్‌డ్ కల్చర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని ఆక్షేపించారు. దుందిబీ నదిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పోటా పోటీగా ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.



## దళితుల భూమిని దౌర్జన్యంగా
# లాక్కుంటారా



- దుందిబీ నదిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల ఇసుకదోపిడీ
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

# 40 వేల మంది జర్నలిస్టులతో 'మహా జాతర'

**- జర్నలిస్టులకు ఈ వసతులన్నీ కల్పించాలి**
**- జర్నలిస్టు సంఘాల (జేఏసీ) ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానం..**




**హైదరాబాద్, డిసెంబర్ 27, తెలంగాణ దిశ)** :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన ప్రసార సాధనాలలో పని చేసే వారందరికీ అక్రెడిటేషన్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, ఉచిత విద్య, వైద్యంతో పాటు జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్, 60 ఏళ్ళు పై బడిన వారందరికీ పెన్షన్ పథకం, ఉచిత బస్ ప్రయాణం ఏర్పాటు చేయాలని, సుమారు 40 వేల మంది జర్నలిస్టులతో 'మహా జాతర' నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నిర?యించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను ఆహ్వానించాలని నిర?యించారు. జర్నలిస్టులు ఇద్దరూ వ్యక్తుల చేతుల్లో కీలు బొమ్మలం కాదంటూ.. సభ ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 48 సంఘాలు ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రారంభోపన్యాసం చేసిన పాశం యాదగిరి మాట్లాడుతూ సోషల్ మీడియాను బ్యాన్ చేయాలనే అంతర్గత ఉద్దేశంతో ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. ఇందులో భాగంగా అక్రెడిటేషన్ నాటకానికి తెర లేపిందన్నారు. జీఓ 252లో వెంటనే తప్పులన్నంటినీ సరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధ్యక్షోపన్యాసం చేసిన మామిడి సోమయ్య మాట్లాడుతూ... గతపాతికేళ్ళ క్రితం ఉన్న సమస్యలే నేటికీ ఉన్నాయని, సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఈ కాలంలో అసలు సమస్యలే లేకుండా ప్రభుత్వం ముందుకు వెళ్ళాలని ఆయన కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆల్ ఇండియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. కోటేశ్వర్ రావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వ ఏర్పాటులో కేబుల్ టీవీ, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా పాత్ర మరువలేనిదని అన్నారు. గతంలో జర్నలిస్టుల వ్యతిరేకంగా ఉన్న అన్ని జీఓలను అంచెలంచెలుగా ఢిల్లీలో ధర్నాలు చేసి వాటిని రద్దు చేయించామని అన్నారు. ఇప్పుడు జరుగుతున్న అక్రెడిటేషన్ రాద్దాంతాలను వెంటనే ఆపు చేయాలని, సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించాలని ఆయన కోరారు.

ప్రత్యేక అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ పరిశోధన పాత్రికేయులు అనంచిన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ తమ చేతుల్లో ఉన్నారని చెప్పుకొని పదవులు పొందుతున్నారని, వీళ్ళ అవకాశ వాద రాజకీయాల కారణంగా ప్రభుత్వం కళ్ళు కప్పి పబ్బం గడుపుకుంటున్నారని, పాతికేళ్ళుగా ఏం చేయలేక, ఎవరు అధికారంలో ఉంటే వారికి భజన చేస్తూ కాలం వెళ్ళదీస్తున్నారని, జర్నలిస్టుల మహా జాతరతో వాళ్ళ బతుకు బయట పెడతామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పులిపలుపుల ఆనందం, కె.కరుణాకర్, వెంకట రత్నం, కోలా శ్రీనివాస్, కన్నూరి రాజు, పడాల వంశీ, ఖమ్మంపాటి సాయి చందర్ గౌడ్,ఆర్. శ్రీనివాస్ గౌడ్, కందుకూరి యాదగిరి, బి. రమేష్ కుమార్, ఎం. శ్రావణ్ కుమార్, బందేల రాజశేఖర్, కొండా శ్రీనివాస్,తన్నీరు శ్రీనివాస్, ఏఐడబ్ల్యూజెఏ ప్రతినిధులు సిహెచ్. వెంకటేశ్వర్లు, పురుషోత్తం, రాజునరసింహ, డివిఐన్. ప్రసాద్, టిజెఎస్ ఎస్ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష, సంయుక్త కార్యదర్శి కీర్తి సంతోష్ రాజ్, బాపట్ల కృషమోహన్, మహిళా కో ఆర్డినేషన్ మమతారెడ్డి, భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజనర్సింహ, సిహెచ్. శ్రీధర్, ఎం. పురుషోత్తం, డాక్టర్ కె. అంజిరెడ్డి, పి. సుధాకర్ గౌడ్, వి.నరేష్, పి.అశోక్ గౌడ్, నీలం బాలరాజ్, కే.రవీందర్ గౌడ్, సత్యం రాంపల్లి, వెంకట యోగి రఘురాం, మహేష్ కుమార్, సంతోష్ కుమార్, బిఎన్. చారి, రాజు, రియాజ్, ఎండి. కరీం, సవల్కేర్ శ్రీధర్, మెడిశెట్టి వెంకటేశ్వర్, ఎస్. శ్రీనివాస్ రావు, ప్రమోద్ కుమార్, జె. బాలకృష, నరేష్ బుచ్చి రెడ్డి, ఎస్. శివప్రసాద్ గౌడ్, లక్కుద్దీన్, శోభన్ బాబు, వేణుగోపాల్ , ఆర్ విఎల్ఎన్. ప్రసాద్, దారం జగన్నాథం రెడ్డి, అశోక్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నంబి పర్వతాలు, సి. హెచ్.శ్రీనివాస్, రావికంటి శ్రీనివాస్, కె.బాపురావు, వివిధ జిల్లాల ప్రతినిధులు, తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

### జర్నలిస్టు సంఘాల జేఏసీ ఏర్పాటు

సభ్యులు కన్వీనర్లుగా మామిడి సోమయ్య, కె.కోటేశ్వర్ రావు, అనంచిన్ని వెంకటేశ్వరరావు, పులిపలుపుల ఆనందం, రావికంటి శ్రీనివాస్, మమతా రెడ్డి, బైసా సంగీత,కో-కన్వీనర్లుగా శ్రీనివాస్, చింతల శ్రీనివాస్, కందుకూరి యాదగిరి, సత్యం గౌడ్, లాయఖుద్దీన్, పురుషోత్తం, చింతకాయల వెంకటేశ్వర్లు, రాజనర్సింహ, డివిఎల్.ప్రసాద్ లతో పాటు పలువురు కో- ఆర్డినేటర్లతో జాయింట్ యాక్షన్ కమిటీ ఈ సంధర్భంగా ఏర్పడింది.




# మీడియా అక్రెడిటేషన్ జీఓ 252 లోని లోపాలను సవరించాలి

**- సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి టీఎస్ జెయు వినతి**
**- టీఎస్ జెయు జిల్లా అధ్యక్షులు చిర్రగోని ఉదయ్ ధీర్**



**మహబూబాబాద్, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** :రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మీడియా అక్రిడిటేషన్ జీవో ఎంఎస్ నెంబర్ 252లోని లోపాలను సవరించాలని, గ్రామీణ జర్నలిస్టులకు, చిన్న పత్రికలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని కోరుతూ సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి టీఎస్ జెయు నేతలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందరరేగా జిల్లా అధ్యక్షులు చిర్రగోని ఉదయ్ ధీర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభంగా భావించే మీడియా రంగానికి సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన నూతన అక్రిడిటేషన్ పాలసీ జర్నలిస్టుల సంక్షేమానికి గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. దశాబ్దాలుగా వృత్తినే నమ్ముకుని బతుకుతున్న గ్రామీణ విలేకరులు, చిన్న పత్రికల ప్రతినిధుల పొట్టకొట్టేలా ఉన్న ఈ జీవోలోని కొన్ని నిబంధనలను మార్చాలని సూచించారు. గ్రామీణ విలేకరుల విద్యార్హతపై సడలింపు నివ్వాలని, జీవో 252 ప్రకారం, మండల, నియోజకవర్గ స్థాయి విలేకరులకు ఇంటర్మీడియట్ పాస్ తప్పనిసరి చేశారని, గతంలో (జీవో 239) పదవ తరగతి అర్హత ఉండేదని అన్నారు. గత 20-30 ఏళ్లుగా కేవలం వృత్తి అనుభవంతో పని చేస్తున్న సీనియర్ గ్రామీణ జర్నలిస్టులను, ఇప్పుడు ఇంటర్ పాస్ కాలేదనే నెపంతో తొలగించడం అన్యాయమన్నారు. తక్షణమే పాత పద్ధతిలో పదవ తరగతి అర్హతను లేదా అనుభవాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు. నూతన జీవోలో అక్రిడిటేషన్ కార్డుల సంఖ్యను భారీగా కుదించారని, గతంలో (జీవో 239)ఉన్న సంఖ్యతోపోలిస్తే, ప్రస్తుతం కేటాయించిన కార్డులు ఏమాత్రం సరిపోవన్నారు. ముఖ్యంగా జిల్లా, మండల స్థాయిలో పని చేసే చిన్న, మధ్య తరహా పత్రికలకు ఇది మరణ శాసనమన్నారు. పనిభారం పెరిగినప్పుడు కార్డులు పెంచాల్సింది పోయి తగ్గించడం భావ ప్రకటనా స్వేఛను హరించడమేనన్నారు. పాత కోటాను పునరుద్ధరించాలన్నారు. యూనియన్ల గుర్తింపులో 'సిండికేట్' విధానం పోవాలని, అక్రిడిటేషన్ కమిటీలో సభ్యత్వం పొందాలంటే, జర్నలిస్ట్ యూనియన్ రిజిస్టర్ అయి కనీసం 6 ఏళ్లు అయి ఉండాలనే నిబంధనను జీఓ 252లో పొందుపరచడం అన్యాయం అన్నారు. ఇది కేవలం పాత యూనియన్ల ఆధిపత్యాన్ని కాపాడటానికి, కొత్తగా పుట్టుకొచ్చిన చురుకైన సంఘాలను అడ్డుకోవడానికి చేసిన కుట్ర అని వ్యాఖ్యానించారు. రిజిస్టర్ అయిన ప్రతి గుర్తింపు పొందిన యూనియన్‌కు కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. చిన్న పత్రికలకు కూడా భారీ సర్క్యులేషన్ నిబంధనలు, ఏబిసి, ఆర్ఎన్ ఐ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయడం వల్ల స్థానిక పత్రికలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. జిల్లా స్థాయిలో ప్రచురితమయ్యే పత్రికలకు నిబంధనలు సడలించి, వాటికి అక్రిడిటేషన్లు, ప్రభుత్వ సహకారం అందించాలని కోరారు . అక్రిడిటేషన్ కార్డుల జారీతో పాటు, జర్నలిస్టుల హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, సంక్షేమ నిధుల వినియోగంపై జిల్లా యంత్రాంగం ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు.

# కీసర సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ గా వసంత




**కీసర, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** :కీసర సర్కిల్‌కు నూతన డిప్యూటీ కమిషనర్‌గా వసంత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందరరేగా ఆమెకు సంబంధిత అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం వసంత మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలను అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ స్పందన ఉండే విధంగా పని చేస్తామని అన్నారు. కీసర సర్కిల్‌ను అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి చేస్తామని పేర్కొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలి

**- జీఓ 252ను సవరించాలని కలెక్టర్‌కు టీఎస్‌జెయు వినతి**



**హనుమకొండ, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** :రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎం.ఎస్. నెం.252లోని లోపాలను వెంటనే సవరించి, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్‌జెయు) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ను యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకగా కలిసి, సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందరరేగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతమున్న జీఓ 252 నిబంధనల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులతో పాటు చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వార్తలు సేకరిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిబంధనలను సరళీకృతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జీఓ 252లోని లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ అందేలా చూడటంతో పాటు, చిన్న పత్రికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌జేయూ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ముతోజు రాము, ప్రధాన కార్యదర్శి దొరి హరికృష?, నాయకులు ఆరూరి శ్రీనివాస్, సదానందం, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో పేట్రేగిపోతున్న అల్లరిమూకలు





**భద్రాచలం, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** : భద్రాచలం ప్రముఖ పుణ్యక్షేత్రంగా దేశ వ్యాప్తంగా ఎంతో పేరుగాంచింది.. దక్షిణ భారతదేశంలోని రెండవ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల క్షేత్రంలో ఆకతాయిల అల్లర్లు రోజురోజుకు పెట్రేగిపోతున్నాయి. పట్టుమని పది రోజులు కావడం లేదు ఒక మర్డర్ జరిగి.. చర్ల రోడ్డులోని ఒక వైన్ షాప్ ముందు పట్టపగలే అందరూ చూస్తుండగానే ఒక వ్యక్తిని అతి దారుణంగా కొంతమంది యువత చంపేశారు.. ఈ సంఘటన చోటుచేసుకుని పది రోజులు కాక ముందే తాజాగా అదే వైన్ షాపుల వద్ద కొంత మంది యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఒక వ్యక్తిని బీరు బాటితో గాయపరచడంతో స్థానికులు హుటా హుటిన ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వివరాలకు వెళితే చింతల జయరాం అనే వ్యక్తిని గిన్నెల సాయి అనే వ్యక్తి బీరు బాటిల్ తో తలపై గాయపరిచాడు. వైన్ షాపుల వద్ద ఎన్ని గొడవలు జరుగుతున్నా పోలీసులు ఏమి చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత ఆరు నెలల్లోనే పట్టపగలే రెండు మర్డర్లు జరిగాయి. మళ్లీ ఈ గొడవ జరగడంతో పోలీసు వ్యవస్థ ఉన్నదా లేదా.. ఉన్నా వారు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా.. మొన్న జరిగిన మర్డర్ తోనే స్థానిక ప్రజలు ఈ వైన్ షాపుల వద్ద పెట్రోలింగ్ ఉండాలని కోరారు..

అయినా పోలీసులు ఇంత నిర్లక్ష్యంగా ఉన్నారని భద్రాచలం పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఈ అల్లార్లతో భద్రాచలం పుణ్యక్షేత్రం కాస్త క్రైమ్ క్షేత్రంగా పేరు పొందుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. మొన్న జరిగిన మర్డర్లో 9 మందిని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారా... పలు కాలనీలలో కాటన్ సెర్చ్ చేసి అనుమతి లేని వాహనాలను స్టేషన్కు తరలించారు.. అంతా అయిపోయింది అనుకున్నారా అదేమీ అవలేదు మళ్లీ ఈ సంఘటన జరగడంతో భద్రాచల పట్టణ ప్రాంత వాసులు చర్ల రోడ్డులోని వైన్ షాపుల వైపు వెళ్లాలంటే భయప్రాంతులకు గురవుతున్నారు. గాయపడిన వ్యక్తి దగ్గరికి వెళ్లి పోలీసులు విచారణ చేపట్టారు ఇప్పటికైనా జరిగిన సంఘటనలకు ఫుల్ స్టాప్ పెడతారా కామా పెడతారా వేచి చూడాల్సిందే.

# నాచారంలోనే సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయాలి



**నాచారం, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** :బీజేపీ నాచారం ఆధ్వర్యంలో ఉప్పల్ జోనల్ కమీషనర్ రాధికాగుప్తను కలిసి నాచారం సర్కిల్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా నాచారం సర్కిల్ ఆఫీస్ ఎంతో చరిత్ర కలిగిన నాచారంలో సర్కిల్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా కొత్తగా నిర్మాణమైన నాచారం వార్డు ఆఫీస్ బిల్డింగ్ సందర్శించాలని, నాచారంలోనే సర్కిల్ కార్యాలయం ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ విషయంపై కమీషనర్ స్పందించి త్వరలో సంబంధిత అధికారులతో మాట్లాడి నాచారం స్వయంగా వచ్చి పరిశీలన చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. బిజెపి నాచారం డివిజన్ అధ్యక్షులు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, మల్కాప్రకాష్, చిల్లా అశోక్ ఉదయ్ కిరణ్ రెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కీసర డిసిని అభినందించిన ముప్పా రామారావు

**కీసర, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** :కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా శనివారం బాధ్యతలు స్వీకరించిన వసంతను కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ సర్కిల్ అధ్యక్షులు ముప్పా రామారావు అభినందించారు. ఈ సందరరేగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన వారికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్కిల్ పరిధిలోని అన్ని వర్గాల సహకారంతో సర్కిల్ ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



# సంపాదకీయం

## పర్యావరణ ప్రమాణాలు గాలికి..!

రాష్ట్రంలో లక్షల కోట్ల పెట్టుబడులతో వచ్చే పరిశ్రమల్లో వేలాది మందికి ఉపాధి కలగనుందని ప్రభుత్వం చెబుతున్న మాటలను ప్రజలు విశ్వసించడం లేదు. పైగా, ఆ పరిశ్రమల ఏర్పాటు కోసం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలన్న డిమాండ్‌పై ఏకమవడం నూతన పరిణామం. ఉపాధి పేరుతో మోసగించి కార్పొ రేట్లు, పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చాలన్న ప్రభుత్వ తాపత్రయానికి ప్రజా పోరాటాలు బ్రేకులు వేస్తున్నాయి. తమ ఆధీనంలోని పోలీసు బలగాలతో ప్రజలను భయపెట్టేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. ప్రజల ఆగ్రహం ముందు అణచివేత, నిర్బంధ చర్యలు సాగవని జన సమూహాలు పాలకులను హెచ్చరిస్తున్నాయి.

పరిశ్రమలకు ఒకనాడు భూములిచ్చిన రైతులు ఇపుడెందుకు ససేమిరా ఇవ్వమంటున్నారు? అన్న ప్రశ్నకు ప్రభుత్వాల దగ్గర జవాబులు లేవు. కానీ భూములిచ్చి, ఉపాధి లేక బతుకు తెరువుకు ఊరూవాడా తిరుగుతున్న రైతులు, పేదలు, మత్స్యకారులు, చేతివృత్తిదారులకు అనేక చేదు అనుభవాలున్నాయి. నేర్చుకున్న జీవిత పాఠాలు న్నాయి. గూడు కట్టుకున్న బాధలున్నాయి. ఈ క్రమంలోనే ప్రైవేటు పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను నిరసన రూపంలో ప్రజాభిప్రాయ సేకరణలో తెలియజేస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలోని సక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు వద్దంటే వద్దని ప్రజలు ఏక కంఠంతో చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోం ది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దెబ్బ తీసి ప్రైవేటీకరించేం దుకు, స్థానికుల ఉపాధిపై ఊసెత్తని ఆర్సెలార్ మిట్టల్‌ను ప్రోత్సహించే ప్రభుత్వ కుట్రలను అర్థంచేసుకున్న ప్రజలు కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో తమ అభ్యంతరం తెలిపారు. రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలను ప్రజలు వ్యతిరేకిస్తుంటే, పెట్టి తీరాలని ప్రభుత్వం మొండిగా వుంది. పోలీసులను చూపి వెనక్కు తగ్గేలా చేయాలని ప్రభుత్వం చూస్తే, ఆ ఆలోచన విరమించుకొనేలా ఒత్తిడి పెంచాలని నిర్వాసితులు, బాధిత మత్స్యకారులు, ప్రజలు భావించారు. కొద్ది రోజుల క్రితం ఆ ప్రాంత పర్యటనకు వెళ్లిన మంత్రి వాహనం ముందు తాటిచెట్టు అడ్డంపెట్టి మరీ పోరాడారు. ప్రజాపోరాటంతో తాత్కాలికంగా పనులు నిలిపివేస్తున్నట్టు మంత్రి ప్రకటించాల్సి వచ్చింది. విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండలంలో గంగవరం పోర్టు ఆవరణలో అదానీకి చెందిన అంబూజా సిమెంట్ గ్రైండింగ్ పరిశ్రమ ఏర్పాటుకు పెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేసినట్లు అధికార యంత్రాంగం ప్రకటన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సొంత నియోజకవర్గం గాజువాక పరిధిలోని పెదగంట్యాడ ప్రాంతంలో ప్రజలు తిరగబడ్డారు. అదానీ కొమ్ముగాసే ప్రభుత్వ ఆటలు ఇక్కడ సాగనివ్వబోమని సిపిఎం, వామపక్షాలు ప్రజల పక్షాన నిలబడ్డాయి.

అదానీకి చెందిన గంగవరం పోర్టు ధూళి, దుమ్ముతో భరించలేని కాలుష్యంతో బాధపడుతున్న ప్రజల్లో అంబూజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ఆగ్రహం వెల్లువెత్తింది. రాష్ట్రంలో తీరప్రాంతం, సెజ్‌లో ఏర్పాటైన ఔషధ, రసాయన పరిశ్రమలతో ఆ పరిసర ప్రాంత ప్రజలకు పీల్చే గాలి, తాగే నీరు ప్రమాదకరంగా మారాయి. ప్రాణాంతక వ్యాధులకు అవి కేంద్రంగా వున్నాయి. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను అటు ప్రభుత్వమూ, ఇటు పరిశ్రమాధిపతులు పూర్తిగా వదిలేశారు. కోట్ల విలువైన రాయితీలు, సదుపాయాలు కల్పించి పరిశ్రమాధి పతులకు లాభాలు సమకూర్చడంపైనే ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయి. ఆ పరిశ్రమలకు భూములిచ్చిన రైతులు, ఉపాధి కోల్పోయిన పేదలు, వృత్తిదారులను విస్మరించాయి.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ముందుకు తెచ్చి ప్రజలకు కనీస భద్రత లేకుండా చేసింది మోడీ, చంద్రబాబు డబుల్ ఇంజన్ సర్కారు. కార్పొరేట్లు, పెట్టుబడిదారులు చట్టబద్ధ నియంత్రణలను పాటించాల్సిన అవసరం లేకుండా చేస్తున్నాయి ఈ ప్రభుత్వాలు. గాలిని, నీటిని కలుషితం చేస్తున్నా పట్టించుకోవడం మానేశాయి. చివరకు కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీల అధికారుల తనిఖీలపై ఆంక్షలు విధించి విచ్చలవిడితనానికి అవకాశం కల్పించాయి.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అత్యంత ప్రమాదకరమైన ఫ్యాక్టరీల జాబితాలో 386 పరిశ్రమలున్నట్లు 2023లో అధికార యంత్రాంగం గుర్తించింది. గత ఐదేళ్లలో 110 పరిశ్రమలకు నోటీసులు జారీ చేశారు. విశాఖ నగర వాసుల ఆరోగ్యాలను కాలుష్యంతో దెబ్బ తీస్తున్న విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, గంగవరం పోర్టును పర్యావరణ ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్.టి.పి.సి కాలుష్యంతో మూల స్వయంవరం, సోమినాయుడుపాలెం ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. పరవాడ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీకి అనుకొనివున్న గ్రామాలు వాయు కాలుష్యంతో తల్లడిల్లుతున్నాయి. పరిశ్రమలు వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేయకుండా చెరువుల్లోకి విడిచిపెడుతున్నాయి. ఘన వ్యర్థాలను ఆరుబయట విడిచిపెట్టిన ఫార్మా సిటీ డెవలపర్ ర్యాంకీ యాజమాన్యానికి కాలుష్య నియంత్రణ అధికారులు నోటీసులు జారీ చేసినా చర్యలేమీ తీసుకోలేదు. ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరు కాలుష్యమయమైంది. అచ్యుతాపురం సెజ్ లోని సిఇటిపి వ్యర్థాలను శుద్ధి చేయకుండా పూడిమడక వాగులోకి వదిలేయడంతో చేపలు చనిపోయి మత్స్యకారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. విచారణలో వ్యర్థాలను శుద్ధి చేయడంలేదని తేలడంతో నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు.

# మార్కండేయ భవన్ సందర్శించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్







**ఏఎస్ రావునగర్, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** :డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ మార్కండేయ నగర్ లోని పద్మశాలి భవన్ ను శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఇందులో భాగంగా మార్కండేయనగర్ లోని కాప్రా పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గురువారం జరిగిన సంఘం 34వ వార్షికోత్సవం వివరాలను కార్యవర్గ సభ్యులు ఆయనకువివరించారు. కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. 34వ వార్షికోత్సవం జరిగేటప్పుడు ఎలాంటి అవాంతరాలు లేకుండా కాప్రా సర్కిల్ శానిటేషన్ సిబ్బందిచే డ్రైనేజి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించినందుకు కార్యవర్గం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు మల్లయ్య, కార్యదర్శి రాపోలు హేమలత, సలహాదారులు దుడుక దశరథ, వంగర మోహనరావు తదితరులు ఎమ్మెల్యే, కార్పొరేటర్ ను ఘనంగా సన్మానించారు.

### మూడున్నర దశాబ్దాల ముచ్చట

కాప్రా పద్మశాలి సంక్షేమ సంఘానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ముప్పయి నాలుగేళ్ల ముచ్చట ఇది. రాధికా థియేటర్ దగ్గరలోని శ్రీనివాసనగర్ లో 18 కుటుంబాల సభ్యత్వంతో కాప్రా సంఘం చిగురించింది. ఆ తరువాత కీసర రామలింగేశ్వర స్వామి సన్నిధిలో మొగ్గ తొడిగి ఇంతింతై మానుగా మారింది. సంఘం అభివృద్ధికి నైతిక బలాన్ని చేకూర్చిన మహనీయుడు అందరూ 'కాకా' అని పిలుచుకునే కీర్తిశేషులు పులిపాటి స్వామి పద్మశాలీల కోసం సంఘం ఎన్నో సేవా కార్యక్రమాలకు చేయూతనందించారు. ఇలాంటి ఎందరో ప్రముఖుల సహకారంతో పద్మశాలి సంక్షేమ సంఘం అనేక కార్యక్రమాలు చేపట్టింది. వాటిలో ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి అనేకం ఉన్నాయి. ముఖ్యంగా శ్రావణ పూరి?మకు గాయత్రీ ధారణ, విహార యాత్రలు, దీపావళికి సహకార పద్ధతిలో చౌక ధరల్లో టపాకాయల పంపిణీ, ఆర్థిక తోడ్పాటు వంటివి ఉన్నాయి. ఆయా సంవత్సరాలలో ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలలో రిటైరైన ఉద్యోగులకు సన్మానం, వార్షిక, ఎంట్రెన్స్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం, పద్మశాలి వధూవరుల పరిణయ, పరిచయ వేదిక నిర్వహించడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆపద కాలాలలో మంచి చెడుల్లో సహచరులకు తోడుగా ఉండటం జరుగుతోంది. భవిష్యత్తులో సంఘ భవనాన్ని విస్తరించి విద్యార్థులకువసతి గృహం నిర్మించాలనే ప్రతిపాదన ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# అక్రిడిటేషన్ల జీవో 252ను సవరించాలి

## - ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ కు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి



**హైదరాబాద్, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** :తెలంగాణ ప్రభుత్వం మీడియా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం విడుదల చేసిన జీవో 252 ను సవరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఫెడరేషన్ ప్రతినిధి బృందం శనివారం సమాచార భవన్ లో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్. ప్రియాంకను కలసి 252 జీవో లో తీసుకు రావలసిన మార్పులను సూచించింది. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, కో- కన్వీనర్లు పులిపలుపుల ఆనందం, బండి విజయకుమార్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడి బాపురావులతో పాటు నాయకులు రఘురాం, పద్మనాభరావు తదితరులు కమీషనర్ తో సుదీర్ఘ చర్చలు జరిపారు. అక్రిడిటేషన్ల జీవోకు తగిన సూచనలు చేస్తూ మార్పులు చేయాల్సిందిగా ఫెడరేషన్ ప్రతినిధి వర్గానికి కమిషనర్ సూచించారు.

డెస్క్ జర్నలిస్టులకు, రిపోర్టర్లకు వేర్వేరు రకాల కార్డులు జారీ చేయడం పట్ల ఫెడరేషన్ ప్రతినిధి వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. అదే విధంగా వార, పక్ష,మాస దినపత్రికల అర్హతకు సంబంధించి జారీ చేసిన నిబంధనలో మార్పులు తీసుకురావాలని కోరారు. వార పత్రికలకు కనీసం 45 సంచికలు పక్ష పత్రికలకు కనీసం 22 సంచికలు, మాస పత్రికలకు కనీసం 11 సంచికలు సమర్పించాలన్న నిబంధనను తొలగించాలని కోరారు. ఈ విధానం పెట్టుబడిదారులకు మాత్రమే ఉపయోగపడుతుందని, న్యాయమైన జర్నలిస్టులను తొలి దశలోనే వృత్తికి దూరం చేసేందుకు ఈ జీవో తోడ్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దినపత్రికలు ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(పీఆర్ జీఐ) నుండి సర్టిఫికెట్ దాఖలు చేయాలనే నిబంధన చేర్చడం పట్ల అభ్యంతరం తెలిపారు. కేబుల్ చానళ్ళకు విధించిన కఠినమైన నిబంధనను సడలించాలని సూచించారు. జీవో 252 పాత్రికేయులపై సెన్సార్ షిప్ విధించినట్లుగా ఉందని వారు పేర్కొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలి

## - జీఓ 252ను సవరించాలని అడిషనల్ కలెక్టర్‌కు టీఎస్‌జెయు వినతి



**ములుగు, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** :రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నెంబర్. 252లోని లోపాలను వెంటనే సవరించి, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్‌జెయు) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ సిహెచ్ మహేందర్ ను యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకగా కలిసి, సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతమున్న జీఓ 252 నిబంధనల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు, చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వార్తలు సేకరిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిబంధనలను సరళీకృతం చేయాలని కోరారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ సిహెచ్ మహేందర్ మాట్లాడుతూ జీఓ 252లోని లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ అందేలా చూడటంతో పాటు, చిన్న పత్రికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ జెయు ములుగు జిల్లా అధ్యక్షులు చల్లగురుగుల రాజువర్ధన్ స్టేట్, సీనియర్ జర్నలిస్ట్ మాట్ల సంపత్, ఉపాధ్యక్షులు నాగపురి హరినాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కంచర్ల రాజు, కమిటీ సభ్యులు పెండల బిక్షపతి, కోటిలింగాచారి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా మండల పూజా మహోత్సవాలు

## - అయ్యప్ప స్వామి నామస్మరణలతో... ఆధ్యాత్మిక శోభ

## -అయ్యప్ప స్వామికి మంగళ హారతులతో చిన్నారుల స్వాగతం





**ఏఎస్ రావునగర్, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)**ఏఎస్ రావునగర్ డివిజన్ కమలానగర్ లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో... మండల పూజ మహోత్సవాలు అంబరాన్నంటాయి. శనివారం మండల పూజ చివరి దినోత్సవాన్ని పురస్కరించుకొని రాధిక చౌరస్తా లోని మహంకాళి అంజనేయ స్వామి దేవాలయం నుంచి కమలానగర్ లోని అయ్యప్ప స్వామి దేవాలయం వరకు స్వామివారిని ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు సాంప్రదాయ వేషధారణలో మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. ఇక కేరళ నుంచి వచ్చిన సంప్రదాయ తాళమేళాల కళాకారులు డప్పు వాయిద్యాలతో భజనలు చేస్తూ స్వామివారిని కీర్తించారు. ఇక సంప్రదాయ వేషధారణలో కావడిలతో పలువురు కళాకారులు నృత్యాలు చేశారు. దీంతో కమలానగర్ కాలనీ పురవీధుల్లో అయ్యప్ప స్వామి నామస్మరణ, శరణు ఘోషలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఇక మండల పూజ మహోత్సవంలో భాగంగా ఆలయంలో రంగురంగు పూలతో, పలు రకాల పండ్లతో ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు పుష్పాభిషేకం చేశారు. అలాగే ఆలయంలో వాకిటి భాస్కర్ గురుస్వామి బృందం చేపట్టినభజనలతో భక్తులు స్వామి నామ స్మరణతో పులకించి పోయారు. పూజానంతరం భక్తులకు అల్పాహారం, ప్రసాదాలను పంపిణీ చేశారు. మహోత్సవాలలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్సార్ నాయర్ గురు స్వామి, బాల మురుగానందం, కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా వాణి రెడ్డి



**ఘట్‌కేసర్, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** :ఘట్‌కేసర్ సర్కిల్‌కు నూతన డిప్యూటీ కమిషనర్‌గా వాణిరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు సంబంధిత అధికారులు, రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అన ంతరం వాణిరెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులోఉంటూ మెరుగైన సేవలను అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ స్పందన ఉండే విధంగా పని చేస్తామని అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్‌ను అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి చేస్తామని పేర్కొన్నారు.

# వరంగల్ లో గార్మెంట్స్ ప్రొడక్షన్!

వరంగల్, : వరంగల్‌లో ఏర్పాటు చేసిన కిటెక్స్ గార్మెంట్స్ కంపెనీ తన ఉత్పత్తి ప్రారంభించింది. రోజుకు1.1 మిలియన్ పిల్లల దుస్తులు తయారు చేయగల సామర్థ్యం దీని సొంతం. త్వరలోనే పూర్తి స్థాయి ఉత్పత్తికి చేరుకుంటామని కంపెనీ యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ కొత్త మార్కెట్లపై దృష్టి సారించి, రిటైల్ స్టోర్లను ప్రారంభించాలని భావిస్తోంది. అలానే తెలంగాణలో మరో చోట కిటెక్స్ రెండో ప్లాంట్ ఏర్పాటుకు రెడీగా ఉంది. వరంగల్ జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్‌లో పార్క్‌లో ఏర్పాటు చేసిన కేరళకు చెందిన కిటెక్స్ గార్మెంట్స్ ఉత్పత్తిని ప్రారంభించింది. కిటెక్స్ అప్పారెల్ పార్క్స్ అనే అనుబంధ సంస్థ ఈ యూనిట్‌ను నిర్వహిస్తోంది. తెలంగాణలో రెండు పెద్ద ప్రాజెక్టులను కిటెక్స్ ప్రతిపాదించింది. వీటిల్లో ఇది ఒకటి. ఇక వరంగల్‌లో ఏర్పాటు చేసిన కిటెక్స్ యూనిట్ రోజుకు 1.1 మిలియన్ రెడీమేడ్ పిల్లల దుస్తులను ఉత్పత్తి చేయగలదు. ఈ యూనిట్‌కు సంబంధించిన అన్ని కార్యకలాపాలను దాదాపుగా ప్రారంభించామని మేనేజింగ్ డైరెక్టర్ సాబు ఎం.జాకబ్ తెలిపారు.అలానే రానున్న రెండు మూడు నెలల్లోనే పూర్తిస్థాయిలో ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకుంటామని జాకబ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త మార్కెట్లపై దృష్టిపెట్టడానికి కిటెక్స్ నయా వ్యూహం రూపొందిస్తోంది.

# సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ గుట్టురట్టు

**కుత్బుల్లాపూర్,డిసెంబర్ 27, (తెలంగాణ దిశ):** సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం డ్రగ్స్ గుట్టు రట్టయ్యాయి.దీంతో ముగ్గురి డ్రగ్స్ పెడ్లర్స్, ఐదుగురు వినియోగదారులను ఎస్ ఓ టీ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో మల్లారెడ్డి ఆసుపత్రిలో పని చేసే ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు ఉన్నట్లు సమాచారం.

ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఓ గదిలో గుట్టుగా డ్రగ్స్ విక్రయిస్తుండగా 8 మందిని సైబరాబాద్, మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ. నాలుగు లక్షల విలువ చేసే 70 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్, రెండు కార్లు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. న్యూ ఇయర్ వేడుకల కోసం, పార్టీలు చేసుకునేందుకు బెంగుళూరు నుంచి హైదరాబాద్ కు డ్రగ్స్ రవాణ చేస్తుండగా మేడ్చల్ ఎస్ ఓ టి పోలీసులు పట్టుకున్నారు.

# కాలనీల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం






## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా,డిసెంబర్ 27,(తెలంగాణ దిశ)** :కాప్రా డివిజన్ పరిధిలోని వంపుగూడ గౌరినాథ్‌పురం ప్రాంతంలో రూ.42లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాలనీల్లో డ్రైనేజ్, రోడ్లు, తాగునీటి సౌకర్యాల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్‌తో పాటు కాలనీ అసోసియేషన్ సభ్యులు కృష్ణారెడ్డి, రమేష్ బాబు, కృష్ణగౌడ్, రాజేందర్, శాంతన్, దేవేందర్, వెంకట్ నారాయణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంద్రయ్య, గిల్ బర్ట్, మహేష్, మల్లారెడ్డి, కొండల్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, పిల్లి సాయిరాం, రాజు గౌడ్, కృష్ణ, శివ,శివలింగం, నర్సింహ, కాశీనాథ్, సతీష్, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా

# బాధ్యతలు స్వీకరించిన శ్రీహరి



**కాప్రా,డిసెంబర్ 27,(తెలంగాణ దిశ):** కాప్రాసర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ గా కె. శ్రీహరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇప్రాజెక్ట్ ఆఫీసర్ గా విధులు నిర్వహించారు.

బాధ్యత లు స్వీకరించిన అనంతరం సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమావే శం నిర్వహించారు.

సర్కిల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ తదితర అంశాలపై సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఈ సందరరేగా శ్రీహరి తెలిపారు.



కాప్రా సర్కిల్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

# అక్రమ నిర్మాణం కూల్చివేత







**కుషాయిగూడ, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ)** :అక్రమ నిర్మాణాన్ని కాప్రా తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది జెసిబి సహాయంతో శనివారం కూల్చివేశారు. కాప్రా మండల పరిధిలోని కుషాయిగూడ ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 199, ప్రైవేట్ భూమి సర్వే నంబర్ 177 సరిహద్దు మధ్యలో ప్రభుత్వ భూమిలో (ఓవర్ లాపింగ్ పై) జరుగుతున్న నిర్మాణాన్ని స్థానికుల ఫిర్యాదు మేరకు కూల్చివేశారు. తహసిల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్, సిబ్బంది కూల్చివేతలో పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవిన్యూ అధికారులు హెచ్చరించారు. గతంలో ఇదే స్థలంలో జరిగిన నిర్మాణాన్ని రెవెన్యూ సిబ్బంది కూల్చివేసిన విషయం విధితమే.

# అలరించిన 'పరి పరి నీ పదమే' కూచిపూడి నృత్య ప్రదర్శన





**శేరిలింగంపల్లి, డిసెంబర్ 27, (తెలంగాణ దిశ) :** మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆల్ ఇండియాక్రాఫ్ట్ మేళ సందర్భంగా ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. డిసెంబర్ చివరివారం, నూతన సంవత్సరంలోకి అడుగిడే సంధర్భంగా పర్యాట కులు,నగర ప్రజలు, కళాభిమానులు శిల్పారామం సందర్శిస్తున్నారు. శిల్పారామం ప్రాంగణంలోని స్టాళ్లనుపరిశీలించాక కళాకారులు, కళాభిమానులు ఓపెన ఆడిటోరయంలో జరిగే సాంస్కృతిక ప్రదర్శనలు తిలకిస్తున్నారు. ప్రదర్శనల్లో భాగంగా టెక్సాస్, యుఎస్ఏ నుండి విచ్చేసిన కూచిపూడి నాట్య గురువులు శ్రీలత సూరి శిష్య బృందం 'పరి పరినీ పదమే, సూర్యాష్టకం, మీనాక్షి పంచరత్న, స్వాగతం కృష్ణ, భూదేవి వరాహ, ధనశ్రీ తిల్లాన' అంశాలను కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. 'మిత్రాంగన్' హైదరాబాద్ మహారాష్ట్ర అసోసియేషన్ వారి సాంస్కృతిక కార్యక్రమాలు లావని, గొందల్, మళంబు, డోల్ తాషా అంశాలను కళాకారులందరూ అంబరీష్ లహంకర్ ఆధ్వర్యంలో ప్రదర్శించి మెప్పించారు.

# కలమే కాగితాన్ని చింపేస్తే..!

# రక్షించాల్సిన సంఘాలే భక్షిస్తే దిక్కెవరు..?

**హైదరాబాద్(తెలంగాణ దిశ):**

**ఒక కలం.. చరిత్రను లిఖిస్తుంది. ఒక కలం.. అన్యాయాన్ని ప్రశ్నిస్తుంది. ఒక కలం.. సమాజాన్ని మేల్కొల్పుతుంది. కానీ.. అదే కలం తన స్వజాతి గొంతు కోస్తే? చరిత్ర రాయాల్సిన కలమే.. సాటి జర్నలిస్టుల బతుకు అనే కాగితాన్ని నిర్దాక్షిణ్యంగా చింపేస్తే? ఇప్పుడు తెలంగాణ జర్నలిజం నడిబొడ్డున జరుగుతున్న ఘోరమిదే.**

**"కంచే చేను మేసిన చందం" అనే సామెత మన యూనియన్ల తీరును చూస్తే చిన్నబోతుంది. ఎందుకంటే ఇక్కడ జరుగుతున్నది కేవలం మోసం కాదు.. నమ్మక ద్రోహం..!**

గత మూడు, నాలుగు దశాబ్దాలుగా జర్నలిస్టుల భుజాల మీద ఎక్కి, నినాదాలు ఇప్పించుకుని, మన శ్రమను పెట్టుబడిగ పెట్టి నాయకులుగా ఎదిగిన వారు.. ఈరోజు మన నెత్తి మీదే కుంపటి పెట్టారు. అక్రిడిటేషన్ కార్డు అనే ఒకచిన్న ప్లాస్టిక్ ముక్కను ఎరగా వేసి, వెనుక కోట్లాది రూపాయల సంక్షేమ నిధులను మింగేస్తున్న 'ఆ మూడు' సంఘాల **(TUWJ-143, IJU, TWJF)** పాపాలను కడిగేయాల్సిన సమయం ఆసన్నమైంది.

మారని రాత.. మారని పేర్లు రాజకీయాల్లో ప్రభుత్వాలు మారతాయి. ముఖ్యమంత్రులు మారుతారు. కానీ తెలంగాణ జర్నలిజం పాలిట శనిలా దాపురించిన ఆ యూనియన్ల పేర్లు మాత్రం మారవు.

**జీవో 239(2016):** నాడు జర్నలిస్టుల పొట్టకొట్టిన ఈ జీవో వచ్చినప్పుడు కమిటీలో ఉండి, చాయ్ బిస్కెట్లు తింటూ సంతకాలు పెట్టింది ఎవరు? ఇదే యూనియన్ నాయకులు కాదా? అప్పుడు 143 యూనియన్ పెత్తనం చేస్తే, మిగతా తోక సంఘాలు వాటాలు పంచుకుని మౌనంగా ఉండిపోయాయి.

**జీవో 252 (2025):** నేడు "ప్రజా ప్రభుత్వం"లో వచ్చిన కొత్త జీవోలో మళ్ళీ కమిటీలో ఉన్నది ఎవరు? అదే పాత ముఖాలు! ఇప్పుడు **IJU** పెత్తనం చేస్తుంటే, 143 యూనియన్ మొసలి కన్నీరు కారుస్తోంది. వీరి నాటకంలో పాత్రలు మారాయేమో కానీ, కథ మాత్రం ఒక్కటే.. "సామాన్య జర్నలిస్టును అణచివేయడం".



6 ఏళ్ల నిబంధన..ఎవరి కోసం ఈ కంచె? తాజా జీవో 252లో ఒక విచిత్రమైన, ప్రమాదకరమైన నిబంధనను చొప్పించారు. అక్రిడిటేషన్ కమిటీలో సభ్యత్వం కావాలంటే ఆ యూనియన్ రిజిస్టర్ అయి "కనీసం6 ఏళ్లు"**(atleast six years)**అయి ఉండాలట. ప్రజా స్వామ్యం లో కొత్త సంఘాలు రాకూడదా? కొత్త గొంతుకలు వినిపించకూడదా? లేదు.. రాకూడ దు! ఎందుకంటే కొత్త వాళ్ళు వస్తే.. పాత నాయకుల అవినీతిచిట్టా విప్పుతారు. అందుకే, మీడియా అకాడమీ ఛైర్మన్ కనుసన్న ల్లో, ఈ పాత సంఘాలు సిండికేట్ గా మారి, కొత్తవారికి ద్వారాలు మూసేసే కుట్ర ఇది. ఇది కచ్చితంగా ప్రభుత్వానికి తెలియకుండా, అధికారులను తప్పుదోవ పట్టించి రాయించుకున్న నిబంధన.

కోట్లు కురిపించిన ప్రకటనలు.. జేబులు నింపిన వాటాలు మిత్రులారా! ఒక్కసారి ఆలోచించండి. మనం రోజూ ఆఫీసుల చుట్టూ, కలెక్టరేట్ల చుట్టూ తిరుగుతూ వార్తలు రాస్తే, పత్రికలకు ప్రకటనలు **(Ads)** వస్తాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే ఒక స్పష్టమైన నిబంధన ఉంది – "ప్రభుత్వ ప్రకటనల మొత్తం నుంచి 2 శాతం (2%) నిధులను కట్ చేసి, జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ కు జమ చేయాలి."

**గత పదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం కొన్ని వేలకోట్ల రూపాయల ప్రకటనలు విడుదల చేసింది. ఆ లెక్కన చూసుకుంటే.. ఈపాటికి "జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్"లో వందల కోట్లు నిల్వ ఉండాలి కదా?**

**ఆ డబ్బు ఏమైంది? ఏ బ్యాంక్ ఖాతాలో మూలుగుతోంది?**

**కమిటీల్లో దశాబ్దాలుగా పాతుకుపోయిన ఈ నాయకులు ఈ లెక్కలను ఎందుకు అడగరు? "మీ వాటా మీకు.. మావాటా మాకు" అనే చీకటి ఒప్పందం ఏదైనా జరిగిందా?**

300 కోట్ల కార్పస్ ఫండ్ మాయాజాలం గత ముఖ్యమంత్రి కేసీఆర్ గారు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వేదికగా.. "జర్నలిస్టులకు 100 కోట్లు కాదు, 300 కోట్ల కార్పస్ ఫండ్ ఇస్తాం" అని ప్రకటించినప్పుడు, మన నాయకులు చేసిన హడావిడి అంతా ఇంతా కాదు.

పాలాభిషే కాలు చేశారు, స్వీట్లు పంచుకున్నారు. ఇప్పుడు నేను అడుగుతు న్నాను.. ఆ 300 కోట్లు వచ్చాయా?

కనీసం ఆ డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినా, ఏడాదికి రూ. 20కోట్ల వడ్డీ **(Interest)** వచ్చేది. ఆవడ్డీ డబ్బుతో ఎంతమ ందికి జర్నలిస్టులకు ఇళ్లు కట్టించారు? క్యాన్సర్, గుండెజబ్బులతో బాధపడుతున్న ఎంతమ ందికి ఆపరేషన్లు చేయించారు?

కరోనా కల్లోలంలో జర్నలిస్టులు పిట్టల్లా రాలిపోతే, ఈ కార్పస్ ఫండ్ నుంచి ఒక్క రూపాయి ఎందుకు బయటకు రాలేదు?

నిధులు రాలేదని తెలిసీ.. ప్రభుత్వాన్ని నిలదీస్తే తమ పదవులు ఊడతాయని, తమకు వచ్చే నజరానాలు ఆగుతాయని మౌనంగా ఉండిపోయిన ఈ నాయకులను ఏమనాలి? ఇది ద్రోహం కాదా?

అల్లమన్నకు అందినంత.. అందరికీ అందాలి కదా! మీడియా అకాడమీ చైర్మన్లుగా, యూనియన్ లీడర్లుగా ఉన్నవారికి జబ్బు చేస్తే.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో,ఏసీ గదుల్లో రాజభోగాలతో వైద్యం అందుతుంది. ప్రభుత్వం లక్షల రూపాయల బిల్లులు తక్షణం చెల్లిస్తుంది. సంతోషం, వారి ప్రాణం దక్కాల్సిందే. కానీ.. మన తోటి సహచరుడు, నల్గొండ జిల్లాకు చెందిన ఒక దళిత జర్నలిస్ట్ బిడ్డ, క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతూ, చికిత్సకు పైసలు లేక, ప్రభుత్వ ఆసుపత్రి వరండాలో (అప్పటికి మేము కొట్లాడితే తీసుకెళ్లారు) దిక్కులేక చనిపోతే.. ఈ అకాడమీ పెద్దలు ఏమయ్యారు? ఈ వెల్ఫేర్ ఫండ్ నిధులు ఏమయ్యాయి? "నాయకుడి ప్రాణానికి ఒక విలువ.. కార్యకర్త ప్రాణానికి ఒక విలువనా?" బతికున్నప్పుడు మందు లకు పైసలు ఇప్పించలేని నాయకులు, ఆ జర్నలిస్ట్ చనిపోయాక మాత్రం శవం దగ్గరికి వచ్చి, "మా సంఘం తరఫున సాయం చేశాం" అని ఫోటోలకు ఫోజులివ్వడం.. శవాల మీద పేలాలు ఏరుకోవడం కాక మరేమిటి?

చదువుకున్న సన్నాసులు! రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నప్పుడు, కార్పొరేషన్ ఛైర్మన్లుగా ఉన్నప్పుడు తటస్థంగా **(Neutral)** ఉండాలనే కనీస ధర్మం కూడా తెలియని "చదువుకున్న సన్నాసులు" మన నాయకు లు. గతంలో అల్లం నారాయణ గారు అకాడమీ ఛైర్మన్ గా ఉండి 143 యూనియన్ ను నడిపించారు.

ఇప్పుడు కె. శ్రీనివాస్ రెడ్డి గారు ఛైర్మన్ గా ఉండి **IJU** నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. కుర్చీ ఎక్కినా కండువా విప్పని ఈ మనస్తత్వమే జర్నలిజాన్ని భ్రష్టు పట్టించింది. ఇదిఆత్మగౌరవ సమరం ఇక చాలు. మౌనంగా భరించింది చాలు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన వ్యవస్థ మారదు. వ్యవస్థను పట్టి పీడిస్తున్న ఈ 'జలగలను' వదిలిస్తేనే సామాన్య జర్నలిస్టుకు న్యాయం జరుగుతుంది.

**అక్రిడిటేషన్ కార్డుల భిక్ష మాకు వద్దు..**

**మాకు రావలసిన సంక్షేమ నిధుల లెక్కలు మాకు కావాలి.**

**కనీస వేతనాల చట్టం అమలు చేయాలి**

**జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కావాలి**

**హెల్త్ కార్డులు పని చేయాలి.**

**పెన్షన్ మా హక్కుగా రావాలి.**

**చిన్న పత్రికలను డిజిటల్ మీడియాను బతికించాలి.**

**ఈ ఆవేదనలో నుంచి పుట్టిందే ఈ కథనాల పరంపర. రాబోయే వారం రోజులు.. అంకెలతో సహా,ఆధారాలతో సహా, ఒక్కో రంగా న్ని,ఒక్కో మోసాన్ని 'పోస్ట్ మార్టం' చేద్దాం. ఇది ఒక వ్యక్తి పోరాటం కాదు.. ఇది తెలంగాణ జర్నలిస్ట్ ఆత్మఘోష...!**

**రేపటి కథనం:**

**"ఆ 2 శాతం నిధులు ఏమయ్యాయి? - కోట్లు మింగిన మౌనం!"**

**పురుషోత్తం నారగౌని**

## నలుపును పోగొట్టాలంటే..



అందాన్ని కాపాడుకోవడానికి.. ముఖంపైనే ఎక్కువ శ్రద్ధ పెడుతుంటారు. ఇతర శరీర భాగాలపై నిర్లక్ష్యం చూపుతుంటారు. ముఖ్యంగా, చర్మం మందంగా ఉండే మోచేతులు, మోకాళ్లను మరీ అశ్రద్ధ చేస్తుంటారు. దాంతో ఆయా భాగాలు నల్లగా మారిపోయి.. అందవిహీనంగా కనిపిస్తుంటారు. కాస్త శ్రద్ధ పెడితే.. మోచేతులు, మోకాళ్ల దగ్గర చర్మం నల్లదనాన్ని పోగొట్టుకోవచ్చని బ్యుటీషియన్లు చెబుతున్నారు. నిమ్మకాయ సహజసిద్ధమైన బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి.. చర్మంలోని మృత కణాలను సమర్థంగా తొలగిస్తుంది. చర్మం రంగునూ మెరుగుపరుస్తుంది. నిమ్మకాయ ముక్కలతో మోచేతులు, మోకాళ్లపై రుద్దితే.. మంచి ఫలితం కనిపిస్తుంది. చర్మం రంగును మెరిపించడంలో పెరుగు ముందుంటుంది. ఇందులో లభించే లాక్టిక్ యాసిడ్.. చర్మాన్ని తేమగా ఉంచుతుంది. మోచేతులు, మోకాళ్లపై పెరుగును అప్లయి చేయాలి. 15-20 నిమిషాలపాటు అలాగే వదిలేసి.. గోరు వెచ్చని నీటితో కడిగేయాలి.కొబ్బరి నూనెలో విటమిన్-ఇ పుష్కలంగా లభిస్తుంది. చర్మాన్ని తేమగా ఉంచడంలో, నలుపును వదిలించడంలో ఇది ముందుంటుంది. వారానికి రెండుమూడు సార్లయినా.. మోచేతులు, మోకాళ్లపై కొబ్బరి నూనెతో సున్నితంగా మర్దనా చేసుకోవాలి. రెగ్యులర్‌గా చేస్తే.. ఆయా భాగాల్లోని నలుపు తొలగిపోతుంది.బంగాళాదుంప ముక్కతో మోచేతులు, మోకాళ్లపై 5 నిమిషాల పాటు బాగా రుద్దుకోవాలి. ఆ తర్వాత నీటితో కడిగితే.. మంచి ఫలితం కనిపిస్తుంది.

## గొంతు నొప్పి, దగ్గు, గొంతులో గరగర సమస్యలకు..

# సహజసిద్ధమైన ఇంటి చిట్కాలు..!



గొంతు నొప్పి అనేది మనకు పలు కారణాల వల్ల వస్తుంది. సీజన్లు మారినప్పుడు లేదా వైరస్ ఇన్ఫెక్షన్ల కారణంగా, కఫం అధికంగా పేరుకుపోవడం, పడని ఆహారాలను తినడం వంటి కారణాల వల్ల గొంతు నొప్పి వస్తుంది. దీంతోపాటు గొంతులో గరగరగా, మంటగా కూడా ఉంటుంది. కొందరికి దగ్గు కూడా వస్తుంది. అయితే ఇలాంటి గొంతు సమస్యలు ఉంటే చాలా మంది టానిక్‌లను తెచ్చుకుని తాగుతారు లేదా మెడిసిన్‌ను వేసుకుంటారు. కానీ మన ఇంట్లో ఉండే పదార్థాలతోనే సహజసిద్ధంగా గొంతు సమస్యలను తగ్గించుకోవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. గొంతు నొప్పి లేదా ఇతర గొంతు సమస్యలను తగ్గించేందుకు ఉప్పు నీరు బాగా పనిచేస్తుంది. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త ఉప్పు వేసి కలిపి ఆ నీళ్లను గొంతులో పోసుకుని పుక్కిట పట్టాలి. ఇలా చేస్తుంటే సత్వరమే నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

**తేనె..:** గొంతు నొప్పిని తగ్గించడంలో తేనె కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. ఇందులో సహజసిద్ధమైన డిమల్సెంట్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు సమస్యలను తగ్గిస్తాయి. గొంతు నొప్పి నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. తేనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు సమస్యలను తగ్గిస్తాయి. తేనెను 1 లేదా 2 టీస్పూన్ల మోతాదులో రోజుకు 3 సార్లు సేవిస్తుండాలి. లేదా ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ తేనెను కలిపి రోజుకు 3 సార్లు తాగాలి. అల్లం టీలోనూ తేనె కలిపి తాగితే ఉపయోగం ఉంటుంది. గొంతు సమస్యల నుంచి సత్వరమే ఉపశమనం లభిస్తుంది. అయితే ఏడాది కన్నా తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు తేనెను ఇవ్వకూడదు.

**హెర్బల్ టీలు..:** గొంతు నొప్పి లేదా ఇతర గొంతు సమస్యలను తగ్గించేందుకు హెర్బల్ టీలు బాగా పనిచేస్తాయి. ఇవి గొంతులో ఉండే కఫాన్ని తొలగిస్తాయి.ఈ టీలలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలుఉంటాయి. ఈ టీలను సేవించడం వల్ల నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఒక పాత్రలో నీటిని తీసుకుని అందులో కొన్ని అల్లం ముక్కలను వేసి మరిగించాలి. అనంతరం వచ్చే నీళ్లను వడకట్టి అందులో కాస్త తేనె, నిమ్మరసం కలిపి తాగాలి. ఈ కషాయాన్ని రోజుకు 2 సార్లు తాగాల్సి ఉంటుంది. దీంతో గొంతు సమస్యలు తగ్గుముఖం పడతాయి. గొంతు సమస్యలకు అతి మధురం కూడా చక్కగాపనిచేస్తుంది. చిన్న అతి మధురం వేరు ముక్కను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతున్నా కూడాగొంతులో నొప్పి, మంట తగ్గిపోతాయి. ముక్కు దిబ్బడ నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. **పుదీనా ఆకులు..:** పుదీనా ఆకులను నీటిలో వేసి మరిగించాలి. అనంతరం వచ్చే నీటిని వడకట్టి తాగాలి. పుదీనా ఆకుల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు గొంతు నొప్పి, మంట, దగ్గు వంటి సమస్యలను తగ్గిస్తాయి. పాలలో పసుపు కలిపి తాగుతున్నా కూడా ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ మిశ్రమాన్ని రోజుకు 2 సార్లు తాగాల్సి ఉంటుంది. మెంతులను నీటిలో వేసి మరిగించి అనంతరం వచ్చే నీళ్లను వడకట్టి అందులో కాస్త తేనె కలిపి తాగుతుండాలి. రోజుకు దీన్ని 3 సార్ల వరకు తాగ వచ్చు. గొంతు సమస్యలను తగ్గించడంలో యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో 1 టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను కలిపి రోజుకు 2 సార్లు తాగుతుంటే ఫలితం ఉంటుంది. ఇలా ఈ సహజసిద్ధమైన చిట్కాలను ఉపయోగించి గొంతు నొప్పి, ఇతర గొంతు సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

# దానిమ్మ పండ్లను తిన్న తరువాత తొక్కను పడేయకండి..

## వాటితో కలిగే లాభాలు తెలిస్తే షాకవుతారు..!



దానిమ్మ పండ్లు చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా ఎరుపు రంగులో దర్శనమిస్తుంటాయి. ఈ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. దానిమ్మ పండ్లను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. కొందరు జ్యూస్ తాగేందుకు ఇష్టం చూపిస్తారు. దానిమ్మ పండ్లను తినడం వల్ల మనకు అద్భుతమైన లాభాలు కలుగుతాయి. పలు వ్యాధులను నయం చేసే శక్తి దానిమ్మ పండ్లకు ఉంటుంది. అయితే దానిమ్మ పండ్లు మాత్రమే కాదు, దాని తొక్క కూడా మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీన్ని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. లేదా తొక్కను ఎండబెట్టి పొడి చేసి దాన్ని కూడా ఉపయోగించుకోవచ్చు. ఇలా దానిమ్మ తొక్కను వాడితే ఎన్నో లాభాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దానిమ్మ తొక్కలతో పలు చిట్కాలను పాటించడం వల్ల వ్యాధులను నయం చేసుకోవచ్చని అంటున్నారు.

**వాపులు, నొప్పులకు..:** దానిమ్మ తొక్కలో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. దానిమ్మ గింజల కన్నా అధిక మొత్తంలో యాంటీ ఆక్సిడెంట్లు దాని తొక్కలోనే ఉంటాయి. ముఖ్యంగా ఈ తొక్కలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించడంలో సహాయం చేస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా శరీరంలో అంతర్గత వాపులు తగ్గిపోతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. నాడీ సంబంధ వ్యవస్థ సైతం ఆరోగ్యంగా ఉంటుంది.దానిమ్మ పండు తొక్కలోబయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. శరీరంలో ఉండే వాపులను తగ్గిస్తాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. శరీరంలోని నొప్పులు తగ్గిపోతాయి.కండరాల నొప్పులనుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..:** దానిమ్మ పండు తొక్కలో యాస్ట్రింజెంట్ గుణాలు ఉంటాయి. ఈ తొక్కలో టానిన్స్ కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి పేగులు, జీర్ణాశయం గోడల మ్యూకస్ పొరను రక్షిస్తాయి. దీంతో విరేచనాల నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్ట, పేగుల్లో ఉండే సూక్ష్మ క్రిములు నశిస్తాయి. మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణశక్తిని మెరుగు పరుస్తుంది. దానిమ్మ పండు తొక్కలో ఉండే పాలిఫినాల్స్ మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**షుగర్ సమస్యకు..:** షుగర్ వ్యాధి ఉన్నవారు దానిమ్మ పండు తొక్కలను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు 2 సార్లు ఒక కప్పు మోతాదులో తాగుతుంటే షుగర్ లెవల్స్ నియంత్రణలోకి వస్తాయి. ఈ తొక్కలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ ను తగ్గించడంలో ముఖ్య పాత్రపోషిస్తాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు ఈ నీళ్లను సేవిస్తుంటే శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ తగ్గుతుంది. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. దానిమ్మ పండు తొక్కలో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల దీన్ని తీసుకుంటే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. ఇన్‌ఫెక్షన్లు, జ్వరం, దగ్గు, జలుబు వంటి బారిన పడిన వారు దానిమ్మ పండు తొక్క నీళ్లను తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. ఇలా దానిమ్మ పండు తొక్క వల్ల ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు.

# బ్రేక్‌ఫాస్ట్‌ను బ్రేక్ చేస్తున్నారా?



ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేస్తున్నారా? అయితే, మీ మానసిక ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉన్నదట. 'అల్పాహారం-మానసిక ఆరోగ్యం'పై చేసిన ఓ సర్వే.. ఈ విషయాలను వెల్లడిస్తున్నది. 'హాంకాంగ్ యూత్ ఎపిడెమియోలాజికల్ స్టడీ ఆఫ్ మెంటల్ హెల్త్' పరిశోధకులు ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందుకోసం 15 నుంచి 24 ఏళ్ల వయసుగల 3,154 మందిని ఎంపిక చేశారు. వీరి రోజూవారి ఆహార అలవాట్లను పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం ఏదో ఒకటి తిన్నవారితో పోలిస్తే.. అల్పాహారం దాటవేసినవారు ఎక్కువ ఉద్రేకంతో, ఆందోళనతో, నిరాశతో కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న వారిలో 85% మంది ప్రతిరోజూ లేదా అడపాదడపా ఏదో ఒక అల్పాహారం తీసుకున్నారు.

మిగిలిన 15% మంది బ్రేక్‌ఫాస్ట్‌ను పూర్తిగా దాటవేశారు. ఈ సందర్భంగా అల్పాహారం తీసుకోని వారిలో శ్రద్ధ తగ్గిపోవడం, స్వీయ నియంత్రణను కోల్పోవడం లాంటి సమస్యలను గుర్తించినట్లు అధ్యయనకారులు చెబుతున్నారు.

ఇక అల్పాహారం దాటవేసేవారు తక్కువ ఉత్పాదకత కలిగి ఉన్నారని, పేలవమైన పనితీరును కనబర్చినట్లు గుర్తించారు. ఉద్యోగాలలోనూ తక్కువ సామర్థ్యం కలిగి ఉన్నారని నివేదించారు. బ్రేక్‌ఫాస్ట్‌ను దాటవేయడం వల్ల మధ్యాహ్నం వరకే నిస్సత్తువ ఆవహిస్తుందనీ, దాంతో దేనిమీదా శ్రద్ధ పుట్టదని చెబుతున్నారు. అందుకే, ఏ రకమైన ఆహారం, ఎంత పరిమాణంలో తింటారనే విషయాలతో సంబంధం లేకుండా.. ఉదయంపూట ఏదో ఒకటి తినడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక అల్పాహారం వల్ల మానసిక ఆరోగ్య ప్రయోజనాలతోపాటు శారీరక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత.. మధ్యాహ్నంపూట తక్కువ కేలరీలు తీసుకుంటారు. దాంతో బరువు అదుపులో ఉంటుంది. రక్తంలోనూ చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి.

## రోజూ గుప్పెడు నలుపు రంగు కిస్మిస్‌లను ఎందుకంటే..?

# నీటిలో నానబెట్టి తినాలి..



కిస్మిస్‌లు.. వీటినే ఎండు ద్రాక్ష అని కూడా అంటారు. ద్రాక్షలను ఎండబెట్టి వీటిని తయారు చేస్తారు. కిస్మిస్‌లను ఎక్కువగా తీపి వంటకాల్లో వేస్తుంటారు. అయితే కిస్మిస్‌లలో అనేక రకాలు ఉంటాయి. వాటిల్లో నలుపు రంగు కిస్మిస్‌లు కూడా ఒకటి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. నలుపు రంగు కిస్మిస్‌లలో పోషకాలు అధికంగా ఉంటాయి. వీటిని తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు పొందవచ్చు. ఈ కిస్మిస్‌లను 100 గ్రాముల మోతాదులో తింటే సుమారుగా 300 క్యాలరీల శక్తి లభిస్తుంది. పిండి పదార్థాలు 80 గ్రాములు, ఫైబర్ 7 గ్రాములు, ప్రోటీన్లు 3 గ్రాములు లభిస్తాయి. కొవ్వులు అసలే ఉండవు. విటమిన్లు బి1, బి2, బి3, బి6, బి9లతోపాటు విటమిన్ సి అధికంగా లభిస్తుంది. అలాగే ఈ కిస్మిస్‌లలో ఐరన్, పొటాషియం, క్యాల్షియం, మెగ్నిషియం, మాంగనీస్, కాపర్, బోరాన్ వంటి పోషకా లు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ కిస్మిస్‌లను తింటే పోషకాలు లభిస్తాయి. పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు.

రక్తహీనత సమస్యకు..: నలుపు రంగు కిస్మిస్‌లలో ఐరన్ అధికంగా ఉంటుంది. అందువల్ల ఈ కిస్మిస్‌లను తింటే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. హిమోగ్లోబిన్ తయారవుతుంది. ఈ కిస్మిస్‌లలో ఉండే విటమిన్ సి వల్ల శరీరం ఐరన్‌ను మరింత మెరుగ్గా శోషించుకుంటుంది. అలాగే కాపర్ కూడా లభిస్తుంది. దీంతో ఎర్ర రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. రక్తం తయారవుతుంది. రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. నలుపు రంగు కిస్మిస్‌లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా సార్బిటాల్ అనే సమ్మేళనం ఉంటుంది.

ఇది లాక్సేటివ్‌గా పనిచేస్తుం ది. అందువల్ల ఈ కిస్మిస్‌లను తింటే పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీని వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది.

ఎముకల ఆరోగ్యానికి..: నలుపు రంగు కిస్మిస్‌లలో క్యాల్షియం, బోరాన్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల సాంద్రతను పెంచుతాయి. ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మనం తిన్న ఆహారంలో ఉండే క్యాల్షియంను శరీరం మరింత మెరుగ్గా శోషించుకుంటుంది. దీంతో ఎముకలు బలంగా తయారవుతాయి. వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరోసిస్ సమస్య రాకుండా అడ్డుకోవచ్చు. మెనోపాజ్ దాటిన మహిళల్లో ఎముకలు బలహీనంగా మారకుండా ఉంటాయి. నలుపు రంగు కిస్మిస్‌లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో సోడియం స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. అలాగే ఈ కిస్మిస్‌లలో ఉండే రెస్వెరెట్రాల్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గేలా చేస్తాయి. దీంతో రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

రోగ నిరోధక వ్యవస్థకు..: నలుపు రంగు కిస్మిస్‌లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి కనుక వీటిని తింటే ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. ఈ కిస్మిస్‌లలో ఉండే పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్, ఆంథో సయనిన్స్ ఆక్సీకరణ ఒత్తిడిని, శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులను తగ్గిస్తాయి. దీంతో తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చు. ఈ కిస్మిస్‌లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి శరీర రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తాయి. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు తగ్గుతాయి. ఇలా నలుపు రంగు కిస్మిస్‌లను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. కనుక వీటిని రోజూ నీటిలో నానబెట్టి తింటే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

# వాదన కావొద్దు వివాదం



ఆలుమగల మధ్య అలకలు అందమే! వాదోపవాదాలూ.. గిల్లికజ్జాలూ సర్వ సాధారణమే! ఇలా.. గొడవలకు దారితీయని అభిప్రాయబేధాలు మంచివేనట. అవి.. భార్యభర్తల నడుమ బంధాన్ని మరింత బలపరుస్తాయట. అయితే.. ఆ మనస్పర్థలను టీ కప్పులో తుఫానులా తేలిపోనివ్వాలి. నివురు గప్పిన నిప్పులా దాచేస్తే.. అసలుకే మోసం వస్తుంది. ఎంత అన్యోన్యంగా జీవిస్తున్నా.. దంపతులన్నాక ఏదో ఒక విషయంలో మాట పట్టింపులు వస్తుంటాయి. వాదోపవాదాలు, చిన్నచిన్న గొడవలు పడుతుంటారు. అయితే, కొందరు ఇలాంటి గొడవలను మొగ్గలోనే తుంచేసి అనుబంధాలను బలపర్చుకుంటారు. కొందరు మాత్రం.. పెద్దవిగా చేసి బంధాన్ని తెంచేసుకుంటారు. 'ది హెల్దీ మ్యారేజ్' డేటా ప్రకారం.. సగటున ప్రతి జంటా నెలకు రెండుమూడు సార్లు గొడవలు పడుతుంటాయట. వీటిలో చాలావరకు.. ముదరకుండా చూసుకుంటూ, అన్యోన్యంగా ఉంటున్నారు. అందుకే, భార్యభర్తల నడుమ తలెత్తే వివాదాలు పరిమితిలోనే ఉండాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. అప్పుడే.. అపార్థాలన్నీ తొలగిపోతాయని అంటున్నారు.

వాదనకూ, గొడవకూ మధ్య తేడాలను గుర్తించాలి. వాదనలో.. ఏదో ఒక నిర్దిష్ట సమస్యపైనే దృష్టిని కేంద్రీకరిస్తారు. దానిపైనే వాడీవేడీగా చర్చించుకుంటారు. ఒకరు చెప్పేది మరొకరు వింటారు. రాజీపడటం, క్షమాపణలు, వాదనలకు పరిష్కార ప్రయత్నాలూ కనిపిస్తాయి. అదే.. గొడవ పడేవారిలో ఒకరిపై ఒకరికి ప్రతికూల భావనలు ఏర్పడతాయి. అది ఇద్దరి మధ్యా దూరం పెంచుతుంది. మనసు విరిగిపోయేలా చేస్తుంది. చిన్నచిన్న అభిప్రాయభేదాల వల్ల భాగస్వామి ఇష్టాయిష్టాలు తెలుస్తాయి. అందుకు తగ్గట్టుగా నడుచుకునేందుకు అవకాశం దొరుకుతుంది. అంతేకాకుండా.. వాదనలతోనే ముగిస్తే, రాబోయే రోజుల్లో పెద్ద గొడవలు జరగకుండా ఉంటాయి. ఆరోగ్యకరమైన వాదనలు బంధాన్ని, సాన్నిహిత్యాన్ని మరింతగా పెంచుతాయి.

చిన్న మాటే.. పెద్దపెద్ద గొడవలకు నాంది పలుకుతుంది. కాబట్టి, భాగస్వామితో వాదించేటప్పుడు భాషను అదుపులో పెట్టుకోవాలి. లేకుంటే.. వాదన వివాదానికి దారితీస్తుంది. పరిస్థితి సంక్లిష్టంగా మారుతుందని గుర్తించుకోండి.

కొందరు పాత విషయాలను మనసులోనే పెట్టుకుంటారు. సందర్భం దొరికితే చాలు పాత సంగతులు తోడుతారు. వాటినే తమ అస్త్రాలుగా మలుచుకొని.. భాగస్వామిపై ఎదురుదాడికి దిగుతారు. దాంతో గొడవలు తీవ్రరూపం దాలుస్తాయి. కాబట్టి, మీ తాజా వాదన దేనిగురించో.. దానిపైనే నిలబడండి. పాత విషయాలను ఎట్టి పరిస్థితిలోనూ చిన్నచిన్న వివాదాల్లోకి లాగకండి.

# వైసీపీ యూ టర్న్..!




**గుంటూరు,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అయితే వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని జగన్ దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయని, నేతలు కూడా గ్రామ, పట్టణ స్థాయిలో డీలా పడే అవకాశముందని జగన్ భావిస్తున్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీకి దిగితే ఖచ్చితంగా పార్టీ ఎదుగుదలకు అది కారణమవుతుందని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇటీవల జరిగిన నేతల సమావేశంలో బూత్ లెవెల్ కమిటీలు వేయాలని జగన్ ఆదేశించారు. బూత్ లెవెల్ కమిటీల నుంచి పార్టీని బలోపేతం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలోనే జగన్ ఉన్నారని తెలిసింది. పులివెందుల ఎంపీటీసీ ఉప ఎన్నిక చూసిన తర్వాత కొందరు నేతలు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాలని జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. అయితే జగన్ మాత్రం ఇందుకు అంగీకరించలేదు. ఓటమికి భయపడి ఎన్నికల్లో పోటీ చేయకపోవడం కార్యకర్తల్లోనూ, గ్రామీణ నాయకత్వంలోనూ అసహనం ఏర్పడుతుందని జగన్ అంచనా వేశారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయడం వల్ల రెండు ఉపయోగాలుంటాయని జగన్ అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుంది. రెండు గ్రామ స్థాయిలో అధికార, విపక్ష వర్గాలుగా విడిపోయి వచ్చే ఎన్నికలకు తమకు అడ్వాంటేజీగా మారుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తలపడాల్సిందేనని జగన్ నేతలకు ఇప్పటికే సూత్రప్రాయంగా చెప్పారని తెలిసింది. నియోజకవర్గ ఇన్ ఛార్జులు కూడా తమ ప్రాంత పరిధిలోని పార్టీకి నమ్మకమైన నేతలకు, కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కూడా జగన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఏడాది మొదట్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అసలు పార్టీ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లో అంచనా వేసుకోవడానికి కూడా ఈ ఎన్నికలు ఉపయోగపడతాయని జగన్ భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే లోపు జిల్లా, నియోజకవర్గ, బూత్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేసే పనిలో ఉండాలని నేతలకు జగన్ ఆదేశించారట. ఈ ఎన్నికల తర్వాత పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా వెంటనే దానికి స్పందన భారీగా వచ్చే అవకాశముందన్న అంచనాల్లో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు.

# అమరావతికి హైస్పీడ్ కారిడార్..

## కోల్‌కతా-చెన్నై హైవేకి సమాంతరంగా నిర్మాణం



**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, మౌలిక వసతుల కల్పన, హైస్పీడ్ కారిడార్లపై ఫోకస్ చేసింది. ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వంతో వందే భారత్ రైళ్లు పెంచడం, బుల్లెట్ రైలు అవకాశాలపై చర్చలు జరుపుతూనే.. రాష్ట్రంలో వీలున్నచోట హైస్పీడ్ కారిడార్ల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఏపీకి మరో హైస్పీడ్ కారిడార్ రానుంది. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి-16 ఏపీ మీదుగా వెళ్తుండగా.. దీనికి సమాంతరంగా ఒక కొత్త హైవే నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహ దారుల మంత్రిత్వశాఖ (మోర్త్) నిర్ణయం తీసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి ఏపీ మీదుగా తమిళనాడు రాజధాని చెన్నైకి గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ నిర్మించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌పై మోర్త్ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం సలహా సంస్థను ఎంపికచేసి, హైవే ఎలా నిర్మించాలనే దానిపై అధ్యయనం చేయించనుంది. ఇప్పటికే కోల్‌కతా-చెన్నై హైవేలో భాగంగా కత్తిపూడి-కాకినాడ నుంచి ఒంగోలు వరకు జాతీయ రహదారి 216 ఉంది. కేంద్రం తాజాగా కోల్‌కత్తా నుంచి చెన్నై మధ్య హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త హైవే విశాఖపట్నం సిటీకి సమీపం నుంచి వెళ్లుంది. విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో హైస్పీడ్ కారిడార్ కలపనున్నారు. తద్వారా గుంటూరు అవతల అదే ఔటర్ రింగ్ రోడ్ నుంచి మిగిలిన భాగం కొనసాగుతుంది. ఆ మార్గాన్ని చెన్నై వరకు నిర్మించకపోయినా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు మధ్య కోల్‌కతా-చెన్నై హైవేలో కలపాలని మోర్త్ ప్లాన్ చేసింది. దీన్ని పూర్తి స్థాయిలో చెన్నై వరకు కొనసాగిస్తేనే గ్రీన్‌ఫీల్డ్‌తో పాటు, యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణం జరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత కోల్‌కతా-చెన్నై హైవే మీద వాహనాల రద్దీ అధికంగా ఉంది. రోజురోజుకూ విపరీతంగా రద్దీ పెరుగుతుండటంతో ఈ హైవే అవసరం ఉంది. కానీ పూర్తి మార్గంలో ఆరు వరుసలు నిర్మించ లేదు. కొన్ని ప్రాంతాల్లో 4 లేన్లు మాత్రమే ఉన్నాయి. దాంతో వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం లేదు. ఈ కారణంతో కోల్‌కతా-చెన్నై హైవేకి సమాంతరంగా మరొక హైస్పీడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే వాహనదారులకు భారీ ఊరట కలుగుతుంది. ఈ హైవే కొత్త ప్రాంతాల మీదుగా వెళ్లడంతో అవి అభివృద్ధి చెందేందుకు అవకాశాలుంటాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 7 హైవేల మీదుగా వెళ్తుంది కనుక అభివృద్ధి జరిగేందుకు వీలుంటుంది. హైస్పీడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే ఉత్తర, తూర్పు భారత్.. దక్షిణాది రాష్ట్రాలను అనుసంధానం చేస్తుందని మోర్త్ భావిస్తోంది. విజయవాడ, అమరావతి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైస్పీడ్ కారిడార్ వెళ్లే సమీపం ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతుంది. కొత్త కంపెనీలు, పరిశ్రమలు వస్తాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అమరావతికి మరింత ప్రయోజనం చేకూర్చు తుంది. నెల రోజుల్లో ఈ హైస్పీడ్ కారిడార్‌పై స్పష్టత రానుంది. మోర్త్ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ల తయారీని పరిశీలిస్తు న్నారు. ఎలైన్‌మెంట్ మీద కసరత్తు పూర్తయితే ఖరగ్‌పూర్- చెన్నై హైస్పీడ్ కారిడార్ వెళ్లే రాష్ట్రాల ప్రభుత్వాలతో సమావేశమై, వారి పర్మిషన్, అభ్యంతరాలు స్వీకరించి తుది ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం, భూసేకరణ కీలకం కానున్నాయి.

# భూ భారతితో సీలింగ్ భూముల సమస్యకు పరిష్కారం



**నల్గొండ,తెలంగాణ దిశ :**సూర్యాపేట జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల రైతులు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించబోతుంది. వారు ఎదుర్కొంటున్న సీలింగ్ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ధరణి పోర్టల్ వల్ల వచ్చిన చిక్కులు తొలగిపోనున్నాయి. దాదాపు 3 వేల ఎకరాల భూమి రైతుల చేతుల్లోకి రానుంది. ధరణి పోర్టల్ వల్ల తలెత్తిన సమస్యకు భూభారతి చట్టంతో పరిష్కారం లభించడమే కాక.. రైతులకు పట్టాలు వచ్చేందుకు మార్గం సుగమం అయ్యింది. ధరణి పోర్టల్ వచ్చాక సూర్యాపేట జిల్లా, నూతనకల్, మద్దిరాల మండలాల్లోని పలు సర్వే నంబర్లలో ఉన్న 1800 ఎకరాల భూములతో పాటుగా మరో 1200 ఎకరాల భూములను సైతం ధరణి పోర్టల్‌లో సీలింగ్ కింద నమోదు చేశారు. దీంతో రెండు మండలాల్లోని 9 గ్రామాల్లో ఈ భూములు సాగు చేసుకుంటున్న రైతులు.. చాలా సంవత్సరాల నుంచి రైతు బంధు, క్రాప్ లోన్లు అందక ఇబ్బంది పడ్డారు. వీటిల్లో 1,842 ఎకరాల భూమి కేవలం ముగ్గురి పేరు మీదే ఉంది. నిజాం కాలంలో ఎర్రబాడు దొరగా పేరు పొందిన జెన్నారెడ్డి ప్రతాపరెడ్డికి.. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో లక్షన్నర ఎకరాల భూమి ఉండేది. అయితే తెలంగాణ సాయుధ పోరాట సమయంలో జెన్నారెడ్డికి చెందిన వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచారు. అలానే 1972లో భూసంస్కరణలు అమల్లోకి రావడంతో.. చట్ట ప్రకారం ఆ కుటుంబం వద్ద ఉండాల్సిన భూములు మాత్రమే ఉన్నాయి. మిగిలిన భూములన్ని రైతులకు పంచారు. అయితే అప్పటి రెవెన్యూ రికార్డుల్లో.. పట్టాదారు కాలమ్‌లో ప్రతాపరెడ్డి భార్య, కొడుకుల పేర్లు రాగా.. కాస్తుదారు కాలమ్‌లో మాత్రం ఆ భూములను సాగు చేసుకుంటున్న రైతుల పేర్లు వచ్చాయి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ వల్ల ఈ రైతులు సాగు చేసుకుంటున్న భూములు సీలింగ్ కిందకు పోయాయి. కారణం.. ధరణి పోర్టల్‌లో కాస్తుదారుల పేర్లు తొలగించారు. కేవలం ఈ భూములకు పట్టాదారులుగా ప్రతాపరెడ్డి కొడుకులు శ్యాంసుందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఆయన భార్య సుభద్రమ్మ పేర్లు వచ్చాయి. ఇక వీరిలో కూడా ఒక్క శ్యాంసుందర్‌రెడ్డి పేరు మీదనే 1,533 ఎకరాల భూమి నమోదు అయ్యింది. సుధీర్‌రెడ్డి పేరు మీద 174 ఎకరాలు, సుభద్రమ్మ పేరు మీద135 ఎకరాల భూమి రికార్డుల్లోకి ఎక్కింది. అయితే గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి పోర్టల్‌లో ఎంజాయ్‌మెంట్ కాలం ఎత్తి వేశారు. కేవలం పట్టాదారు కాలం మాత్రమే ఉండటంతో.. ఈ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పాస్ పుస్తకాలు లభించ లేదు. దీంతో వారు అన్ని ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. తమ సమస్యను పరిష్కరించి పాస్ బుక్కులు ఇవ్వాలంటూ అధికారుల చుట్టూ తిరిగినా లాభం లేకుండా పోయింది. అయితే వీరి సమస్యకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి ద్వారా పరిష్కారం లభించింది. భూభారతిలో ఎంజాయ్మెంట్ కాలమ్‌ను పునరుద్ధరించారు. దీంతో ఈ మండలాల రైతులకు పట్టాలు ఇచ్చేందుకు అవకాశం లభించింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం నుంచి నూతనకల్, మద్దిరాల మండలాల్లో సర్వే చేపట్టనున్నారు. ఇందుకోసం మొత్తం 16 టీంలను ఏర్పాటు చేశారు. ఒక్కో మండలంలో8 టీమ్‌లు 45 రోజుల పాటు సర్వే చేయనున్నాయి. సర్వే ముగిసిన తర్వాత ఈ మూడు వేల ఎకరాల భూములను రెగ్యులరైజ్ చేసి.. ఆ తర్వాత అర్హులైన రైతులకు డిజిటల్ పాస్ పుస్తకాలు అందజేయనున్నారు.

# 100 రూపాయలతో రిజిస్ట్రేషన్




**కాకినాడ,తెలంగాణ దిశ :**ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసింది. అక్టోబర్ నుంచి గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా నిర్ణయం తీసుకుంది. పది లక్షల రూపాయల విలువ కలిగిన భూములకు 100 రూపాయలతో రిజిస్ట్రేషన్ చేసుకునే వేసులుబాటు కల్పించింది. అంతకుమించి అయితే వేయి రూపాయల రుసుము తీసుకోనుంది. గ్రామ సచివాలయాల్లోనే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది. దీని ద్వారా ప్రజలకు మరింత సులువైన సేవలు అందించినట్టు అవుతుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వారికి ఇది నిజంగా ఆనందించదగ్గ విషయమే. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి కలిగిన పట్టాదారుల్లో లక్షలాదిమంది జీవించలేరు. కానీ వారి పేర్లతో ఇప్పటికీ పట్టాలు కొనసాగుతున్నాయి. ఇది భూ హక్కుదారులకు ఇబ్బందికరమే. వెబ్ లాండ్ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 85, 41,002 మంది పట్టాదారులు ఉన్నారు. వారిలో 3,91,405 మంది ఇప్పటికే మరణించారు. అంటే మొత్తం పట్టాదారుల్లో 4.58 శాతం మంది జీవించలేరు అన్నమాట. ఈ భూములు వారసుల స్వాధీనంలోనే ఉన్నా వారి పేర్లతో బదిలీ కాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. భూ బదలాయింపులకు గాను తక్కువ రుసుముతో గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు చేపట్టింది. అక్టోబర్ నుంచి ఈ కొత్త విధానం అమలు కానుంది. వారసత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఒక శాతం స్టాంప్ రుసుము చెల్లించాలి. దశాబ్దాలుగా తమ వద్ద ఉన్న భూములను మళ్లీ రుసుము కట్టాలన్న ఆవశ్యకత ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే అంత మొత్తంలో భరించలేని వారు ఉన్నారు. కుటుంబ సభ్యుల మధ్య వాటాల సమస్యలు తేలక పోవడం వల్ల రిజిస్ట్రేషన్లు ముందుకు సాగలేదు. భూమి బదలాయింపు కాకపోవడంతో చాలామందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కడం లేదు. రైతు భరోసా వంటివి వర్తింపు కావడం లేదు. బ్యాంకు రుణాలు లభించడం లేదు. అవసరానికి భూమి విక్రయించేందుకు అవకాశం లేకుండా పోతోంది. అందుకే సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం అమలయితే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రయోజనం కలగనుంది. అయితే సచివాలయాల్లో వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్కు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అక్కడ సిబ్బందికి శిక్షణ, కంప్యూటర్లు, పరికరాలు అవసరం అవుతాయి. అయితే వారానికి ఒకటి రెండు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉంది. అయితే సచివాలయాల్లోన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు భారీగా ఖర్చు కానుంది. ప్రజలకు సులభతరం చేసే పనిలో భాగంగా ప్రభుత్వంపై ఇప్పుడు ఆర్థిక భారం పడనుంది. అందుకే దీనిపై అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. కానీగత ఏడాదిలో భారీగా వచ్చిన ఫిర్యాదులతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే గ్రామ సచివాలయాల్లో ఈ రిజిస్ట్రేషన్ ఎంత వరకు విజయవంతం అవుతుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

# ఓ వైపు జాతీయ వాదం.. మరో వైపు విభజనవాదం

భారతదేశం ప్రస్తుతం రెండు వ్యతిరేక దిశల్లో పయనిస్తోంది. ఒకవైపు జాతీయవాద భావనలు బలపడుతుండగా, మరోవైపు విభజన శక్తులు కూడా ఊపందుకుంటున్నాయి. ఈ విరుద్ధతలు సమాజంలో ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. దేశవ్యాప్తంగా జాతీయవాద భావనలు పటిష్టమవుతున్నాయి. విద్యా సంస్థల్లోనూ ఈ పోకడ స్పష్టంగా కనిపిస్తోంది. దక్షిణాది నుంచి ఉత్తరాది వరకు, ప్రముఖ యూనివర్శిటీల్లో జాతీయ భావనలతో కూడిన సంఘాలు విజయాలు సాధిస్తున్నాయి. ఇది కేవలం విద్యార్థి రాజకీయాలకే పరిమితం కాదు.. స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీలు మరియు పార్లమెంటరీ ఎన్నికల్లో కూడా జాతీయవాద పార్టీలు తమ ఆధిక్యతను నిరూపిస్తున్నాయి. అంతేకాకుండా, ధార్మిక జాగృతి ఒక ఉద్యమ రూపం దాలుస్తోంది. ఆలయ పర్యటనలు పెరుగుతున్నాయి, భక్తుల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందుతోంది. ఈ ధోరణి సమాజంలో ఐక్యతను ప్రోత్సహిస్తుంది, కానీ దీనిని విచ్ఛిన్న శక్తులు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. జాతీయవాదం బలపడటం దేశ ఐక్యతకు బలమిస్తుంది, అయితే ఇది అతివాద రూపాలు దాల్చకుండా చూడాలి. జాతీయవాదం పెరుగుతున్నప్పటికీ, దీనికి విరుద్ధంగా కులం, మతం ఆధారిత విభజనలు కూడా బలపడుతున్నాయి. రాష్ట్ర స్థాయి, జాతీయ ఎన్నికల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా సమాజాన్ని చీల్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది కేవలం రాజకీయాలకే పరిమితం కాదు.. సామాజిక స్థాయిలో కూడా విష సంస్కృతిని ప్రోత్సహిస్తోంది. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలు చిన్న పట్టణాలకు విస్తరిస్తున్నాయి. గతంలో పెద్ద నగరాలకే పరిమితమైన ఈ సమస్య, ఇప్పుడు గ్రామీణ మరియు చిన్న పట్టణాల్లోనూ వ్యాపిస్తోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు డిజిటల్ మాధ్యమాల ద్వారా విధ్వంసకర చర్యలకు పాల్పడుతున్నట్లు బయటపడుతోంది. ఈ విభజనలు సమాజ ఐక్యతను బలహీనపరుస్తాయి. ఇవి దీర్ఘకాలిక సవాళ్లను సృష్టిస్తాయి. దేశంలో మత ఆధారిత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ప్రముఖ నగరాల్లో విదేశీ భావనలతో కూడిన నినాదాలు, చిహ్నాలు కనిపిస్తున్నాయి, ఇది దేశీయ ఐక్యతకు హానికరం. కొన్ని న్యాయస్థానాల తీర్పులు ఇలాంటి చర్యలకు మార్గం సుగమం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఫలితంగా అల్లర్లు, హింసాత్మక సంఘటనలు పెరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో ఈ సమస్యలు తీవ్రమవుతున్నాయి. మత సంబంధిత చిహ్నాలు నినాదాలు హింసకు దారితీస్తున్నాయి. స్థానిక సంస్కృతి, పండుగలపై అభ్యంతరాలు లేవనెత్తడం ద్వారా ప్రభుత్వాలు కూడా జోక్యం చేసుకోవాల్సి వస్తోంది. ఈ ధోరణి మత సామరస్యాన్ని దెబ్బతీస్తుంది.. సమాజంలో భయాందోళనలను పెంచుతుంది. ఈ విద్వేషాల వెనుక కొన్ని విచ్ఛిన్నకర గ్రూపులు, బయటి ప్రభావాలు ఉన్నట్లు కనిపిస్తోంది. పొరుగు దేశాల్లో రాజకీయ మార్పులు జరిగిన తరహాలో, భారతదేశంలో కూడా ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నా యి. చిన్న గ్రూపులు స్థానిక స్థాయిలో ప్రభావం చూపుతూ, జాతీయ ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. చారిత్రక ఘటనల సమయంలో కూడా ఇలాంటి నినాదాలు, చర్యలు కనిపిస్తున్నాయి, ఇది ఒక వ్యూహాత్మక ప్యాటర్న్‌ను సూచిస్తుంది. ఈ గ్రూపులు సమాజాన్ని విభజించడం ద్వారా దేశ స్థిరత్వాన్ని దెబ్బతీయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ప్రభావాలు దీర్ఘకాలంలో దేశ భద్రతకు ముప్పు కలిగిస్తాయి. జాతీయవాదం, విచ్ఛిన్న శక్తుల మధ్య ఈ సంఘర్షణ దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఐక్యతను పటిష్టం చేస్తూ, విభజనలను అరికట్టడం అవసరం. లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించినప్పుడు స్థానికులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. అయితే కొద్ది కాలంలోనే రాష్ట్ర హోదా కోసం డిమాండ్ ప్రారంభమైంది. ఇది సహజసిద్ధమైన స్థాని క హక్కుల పోరాటం కాకుండా, ప్రణాళికబద్ధమైన రాజకీయ తద్వారా అంతర్జాతీయ దష్టి ఆకర్షించాలనే ప్రయత్నం అని చెప్పవచ్చు. మెగసెసె అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చూ, ఈ ఉద్యమానికి ప్రధాన నాయకుడిగా ఎదిగారు. ఆయన నడిపిన సంస్థలకు లైసెన్స్ రద్దు కావడమే మొదటి ఘర్షణ. వాంగ్‌చూ తండ్రి కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి కావడం వలన ఆయన రాజకీయ నేపథ్యం కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన అంశం. ఆయన సంస్థలకు ఇచ్చిన భూమి లీజు రద్దు తరువాత ఆయన క్రమంగా రాష్ట్ర హోదా ఉద్యమం మొదలు పెట్టారు. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే ఒక విద్యా, సాంస్కృతిక కార్యకర్త ఒక్కసారిగా ఎందుకు హింసాత్మక ఉద్యమానికి పూనుకుంటారు సమాధానం ఒకవైపు వ్యక్తిగత నష్టం, మరోవైపు రాజకీయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్న వ్యూహం. లడఖ్ ఉద్యమాన్ని కేవలం స్థానిక అసంతృప్తిగా చూడటం తేలికైన నిర్ణయమే అవుతుంది. వాంగ్‌చూ ప్రసంగాలు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో జరిగిన అల్లర్ల తీరును పోలి ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇక అరెస్ట్ అయిన వారిలో కొందరు నేపాల్‌కు చెందినవారు కావడం కూడా ఈ వాదనను బలపరుస్తోంది. చిన్నచిన్న ప్రాంతాల్లో హింస చెలరేగించడం ద్వారా ప్రపంచ మీడియా అటెన్షన్ పొందాలన్న గ్లోబల్ ప్రొటెస్టు మోడల్ ఇక్కడ ప్రయోగించినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వాలు, సమాజం, విద్యా సంస్థలు కలిసి ఈ సవాళ్లను ఎదుర్కోవాలి. విచ్ఛిన్నకర శక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే సమతుల్యమైన సమాజాన్ని నిర్మించవచ్చు. ఇది కేవలం రాజకీయ సమస్య కాదు.. సామాజిక బాధ్యత కూడా..!

# రెండు లక్షల్లో త్రీడి ఇళ్లు...

న్యూఢిల్లీ, : నేటి కాలంలో ఇల్లు కట్టుకోవడం అంటే గగనమే అని కొందరు భావిస్తుంటారు. ఎందుకంటే ఇల్లు నిర్మాణం కోసం ఉపయోగించే సామగ్రి ధరలు విపరీతంగా పెరిగాయి. అంతేకాకుండా భవన నిర్మాణ కార్మికుల వేతనాలు సైతం భారీగా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న ఇల్లు నిర్మించాలని అనుకున్నా కనీసం రూ. 10 లక్షలు కావాల్సిందే. అదికూడా అనుకున్న సమయానికి పూర్తవుతుందో..? లేదో..? అన్న ఆందోళన ఉంది. అయితే ఇప్పుడు ఆ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కేవలం రూ. 2 లక్షలకే 3ఆ ఇల్లు పూర్తి అవుతుంది. అది కూడా 45 రోజుల్లో గృహప్రవేశం కూడా చేసే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ త్రీడీ ఇళ్ల ప్రత్యేకత ఏంటి? దీనిని ఎలా నిర్మించుకోవాలి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం గురించి ఇల్లు నిర్మాణదారులకు తెలిసిన విషయమే. ఎందుకంటే కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారికి ఈ పథకం కింద కొంతవరకు ఆర్థిక సహాయం పొందవచ్చు. అయితే ప్రస్తుతం ఈ పథకం కింద పూర్తిగా ఇల్లును నిర్మిస్తున్నారు. కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో 3ట ఇలా నిర్మాణాలు చేపట్టారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూర్కీలో ఇప్పటివరకు 130 ఇళ్ళను నిర్మించినట్లు కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఇటీవల మీడియా సంస్థలకు తెలిపాడు. తక్కువ ధరలో ఇల్లు నిర్మించాలని ఉద్దేశంతో త్రీడీ ఇళ్లను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ' పెహల్ 'అనే ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు కింద 250 ఇళ్ల డిజైన్ తయారు చేశారు. వీటిలో 3ట ప్రింటింగ్ టెక్నాలజీ ఇళ్లు బాగా ఆకర్షిస్తున్నాయి. ఈ ఇల్లు నిర్మాణంతో తక్కువ మొత్తం అవసరం ఉండడంతో పాటు మిగతా ఇళ్లతో పోలిస్తే ఇవి చాలా చల్లగా ఉండే అవకాశం ఉంది. 3ట ప్రింటింగ్ టెక్నాలజీ ఇంటి నిర్మాణంలో ఎలాంటి కంకర వాడరు. కానీ స్లాబ్ కు మాత్రం ఇనుము వాడతారు. గోడలు పూర్తిగా ప్లేయూష్ ఇటుకలతో నిర్మిస్తారు. వీటి మధ్యన కాస్త సిమెంటును వాడతారు. మిగతా గోడలతో పోలిస్తే ఈ ఇటుకలకు తక్కువ సిమెంట్ అవసరం పడుతుంది. అయితే ఒక అంతస్తు నిర్మించుకునే వారు స్లాబ్ ను ఒకప్పటి పెంకుటిల్లులా నిర్మించుకోవచ్చు. అలాగే దీనిపై మరో రెండు అంతస్తులు వేసి కూడా ఇంటి నిర్మాణం చేసుకోవచ్చు.

# దువ్వాడపై చర్యలేవి?

## కేడర్ లో అసంతృప్తి జ్వాలలు



**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :** ఇటీవల కాలంలో వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం మరింత ముదిరిపోయింది. ఆమధ్య ఆయన ఏదో ఊరూపేరూ లేని యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. అది కూడా తన స్నేహితురాలు మాధురితో కలసి. ఆ తర్వాత ఉగాది పురస్కారాలు అంటూ దువ్వాడ–మాధురి స్టేజ్ మీదే దండలు మార్చుకున్నారు. తాజాగా విద్యుత్ శాఖ ఏఈపై దువ్వాడ బూతులతో విరుచుకుపడ్డారు. ఇవన్నీ చూస్తున్నా ఇంకా దువ్వాడ విషయంలో జగన్ నోరు మెదప లేదు, కనీసం పార్టీ క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకోవడం లేదు. భార్యని వదిలిపెట్టి, ప్రియురా లితో పబ్లిక్ గా తిరుగుతున్న దువ్వాడ ఏపీ పెద్దల సభలో తమ పార్టీ సభ్యుడు అని చెప్పుకోడానికి కూడా వైసీపీకి పరువు తక్కువే. రాజకీయ నాయకులైనంత మాత్రాన కుటుంబ కలహాలు ఉండకూడదు అనుకోలేం. ఆ మాటకొస్తే వివాహాల విషయంలో కూడా ఎవరి వ్యక్తిగత నిర్ణయాన్ని ఇంకెవరూ తప్పుబట్టడానికి లేదు. అయితే దానికి కూడా ఓ పద్ధతుంటుంది. రెండో వివాహం చేసుకోవాలంటే మొదటి భార్యకు విడాకులు ఇవ్వాలనేది చట్టం. కానీ ఆచట్టాన్ని పక్కనపెట్టి, భార్యని వదిలిపెట్టి, ఎంచక్కా ప్రియురా లితో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్. ఈమధ్య వీరి జోరు బాగా ఎక్కువైంది. మీడియా వీరిద్దర్నీ హైలైట్ చేయడంతో దువ్వాడ ఏమాత్రం వెనక్కి తగ్గడంలే దు. మాధురి జంటగా ఆయన కెమెరాలముందు ఇస్తున్న ఫోజులు వైరల్ గా మారుతున్నాయి. కూతురు వయసున్న మహిళతో దువ్వాడ సాన్నిహిత్యం ఎంతవరకు కరెక్ట్..? ఆ విషయం తెలిసినా కూడా ఆయన్ను వైసీపీ వెనకేసుకు రావడం ఇంకెంత వరకు కరెక్ట్. గతంలో పవన్ కల్యాణ్ వివాహాల గురించి తీవ్ర విమర్శలు చేసిన జగన్, దువ్వాడ కథపై మాత్రం నోరు మెదపడం లేదు. కనీసం ఆయనపై పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకోకపోవడం విశేషం.దువ్వాడలో ప్రేమాయణం అనే యాంగిల్ మాత్రమే కాదు, బూతుల కోణం కూడా ఉంది. కరెంటు బిల్లు కట్టకుండా ఆపేసి, కనెక్షన్ తొలగించినందుకు ప్రభుత్వ అధికారిపై ఆయన దుర్భాషలాడిన ఆడియో ఇప్పుడు వైరల్ గా మారింది. ఈ ఆడియో బయటపడిన తర్వాత వైసీపీని జనం మరింతగా చీదరించుకుంటున్నారు. ఇలాంటి వారందర్నీ ఆ పార్టీలో జగన్ ఎందుకు ఇంకా ఎంటర్టైన్ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.మూడు నెలలు విద్యుత్ బిల్లులు చెల్లించని దువ్వాడ, కనెక్షన్ తీసేసినందుకు ఏఈపై బూతులతో విరుచుకుపడ్డారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి విద్యుత్ శాఖ ఏఈ మురళీమోహన్ కి ఫోన్ చేసి బూతులు తిట్టి బెదిరించారు. మురళీమోహన్ దళిత వర్గానికి చెందిన అధికారి కావడంతో ఆసామాజిక వర్గం భగ్గుమంది. దళితులంటే అంత చులకనా అని వారు మండిపడ్డారు. కనీసం ఈ విషయంలో అయినా జగన్ స్పందించాలని, దళిత అధికారిని బూతులు తిట్టిన దువ్వాడపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.దువ్వాడ వ్యక్తిగత విషయాలను ఎవరూ పెద్దగా ప్రశ్నించకపోయినా, ఇప్పుడిలా అధికారులపై బూతు ల దండకంతో విరుచుకుపడటం మాత్రం కచ్చితంగా ఖండించాల్సిన విషయమే. దువ్వాడ లాంటి నాయకుడు టీడీపీలో ఉంటే కచ్చితంగా వైసీపీ నుంచి కౌంటర్లు పడేవి, జగన్ కూడా ఏమాత్రం సందేహించకుండా విమర్శించేవారు. మరి అదే నాయకుడు వైసీపీలో ఉంటే మాత్రం ఆ పార్టీ నోరు మెదపడం లేదు.

# మారనున్న.. బెల్లంపల్లి



**ఆదిలాబాద్,తెలంగాణ దిశ :**ఎట్టకేలకు బెల్లంపల్లి కార్మిక క్షేత్రానికి మహర్దశ ఆవరించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల మంజూరులో బెల్లంపల్లికి చోటు కల్పి ంచారు. దీంతో ఈ ప్రాంత వాసుల్లో సంతో షం వెల్లివెరుస్తోంది. పారిశ్రామిక ప్రాంతం గా పేరుగాంచి భూగర్భ గనుల వెనుకడుగుతో బెల్లంపల్లి ఉనికినీ కోల్పోతుంది. ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరుతో బెల్లంపల్లికి పూర్వ వైభవం రానుంది. నూతనంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరులో బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియో జక వర్గాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. రూ. 200 కోట్లతో ఒక్కో పాఠశాల 25 ఎకరాల విస్తీర్ణంలో అత్యున్నతమైన ప్రమాణాల తో భవనాలు ఏర్పాటు చేయనున్నారు.నూతనంగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల విద్యా బోధన లభిస్తుంది. భవిష్యత్తులో కేజీ నుంచి పీజీ వరకు ఈ ప్రాంతం పిల్లలకు అత్యున్నతమైన విద్య అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరులో ప్రత్యేక చొర వను కనపరిచినట్లు తెలుస్తుంది. సీఎం రేవం త్‌రెడ్డిని ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు విషయంలో తగిన శ్రద్ధ వహించి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. బెల్లంపల్లిలో పాలిటెక్నిక్ కళాశాల మాత్రమే ఉన్నత విద్యా అవ కాశాలకు ఏకైక మార్గంగా ఉంది. ఎంతోకాలంగా ఈ ప్రాంత ప్రజలు తమ పిల్లల ఉన్న త విద్య కోసం సుదూర ప్రాంతాలకు పంపిస్తున్నారు.లక్షల రూపాయలను కార్పొరేటు కళాశాలలకు ఫీజులు రూపంలో చెల్లిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో ఈ ప్రాంత విద్యార్థులు అందిపుచ్చుకోనున్నారు. ఇప్పటి వర కు బెల్లంపల్లి ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఏ ఎమ్మెల్యే, ప్రభుత్వాన్ని ఒప్పిం చి ఉన్నత విద్య కళాశాలను సాధించిన ఘనత లేదు.బెల్లంపల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను సాధించి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రికా ర్డును సొంతం చేసుకున్నారు. ఇదే కాకుండా బెల్లంపల్లిలో ఇంజనీరింగ్ కళాశాల కూడా తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఇంజనీరింగ్ కళాశాల ఒకటి అనే విషయం తెలిసిందే. ఇది ఇలా ఉంటే అత్యున్నతమైన విద్య ప్రమాణాలు గల స్కూల్‌ను సాధించడంతో ఈ ప్రాంత ప్రజలు ఆనంద డోలికల్లో మునిగిపోతున్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుతో బెల్లంపల్లి జాతీయస్థాయిలో విద్య ప్రమాణాల సరసాన నిలువనుంది. ఏది ఏమైనా ఈ ప్రాంత ప్రజల ఊహకందని అత్యున్నతమైన విద్య ప్రమాణాలు గల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కల నెరవేరినట్టయింది. ఈ మేరకు అధికారగ ణం స్కూల్ నిర్మాణం కోసం 25 ఎకరాల స్థల సేకరణలో ఉన్నారు. స్థలం గుర్తింపు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారని సమాచారం. ఆమోదయోగ్యమైతే త్వరలోనే ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ స్కూల్ ఏర్పాటులో తొలి ఘట్టం సుఖాంతమైనట్టే.

# నష్టాలతో స్టాక్ మార్కెట్లు ప్రారంభం..!



బిజినెస్ : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని భారీ నష్టాలతో ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగా సూచీలు ఒత్తిడికి గురవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 450 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 23,400 మార్క్ వద్ద ఊగిసలాడుతోంది. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 374 పాయింట్ల నష్టంతో 77,035 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 85 పాయింట్ల నష్టంతో 23,433 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎంఅండ్‌ఎం, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, నెస్లే ఇండియా షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి.

మిశ్రమంగా అమెరికా మార్కెట్లు : అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 74.93 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.బంగారం ఔన్సు 3,174 డాలర్ల మార్క్‌ను దాటింది. అమెరికా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. ఎస్ అండ్ పీ సూచీ 0.55 శాతం, డౌజోన్స్ 1 శాతం మేర లాభపడ్డాయి. నాస్‌డాక్ మాత్రం ఫ్లాట్‌గా ముగిసింది. ఆసియా–పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఆస్ట్రేలియా ఎఎస్ఎక్స్ సూచీ 0.63 శాతం, జపాన్ నిక్కీ 0.58 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 1.05 శాతం, షాంఘై 0.48 శాతం లాభంతో కదలాడుతున్నాయి.

# ఇన్‌స్టంట్ బీర్ కేఫ్‌లు

## మైక్రోబ్రూవరీలకు సర్కార్ ఏర్పాట్లు

**నగరంలో ప్రతి 5 కిలోమీటర్లకు జిల్లాల్లో 30 కిలోమీటర్లకు ఒకటి!**
**సగటున 13 వేల మందికో కేఫ్ హెచ్ఎండీఏ పరిధిలో100 కేఫ్‌లు**
**అనుమతించే యోచనలో ప్రభుత్వం ఎక్సైజ్ నిబంధనలకు సవరణలు**



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** సర్కారు గల్లా పెట్టె ఫుల్లుగా నింపుకోవాటానికి మరో బీరు పథకాన్ని అమల్లోకి తెస్తున్నది. ఇన్‌స్టంట్ కాఫీ షాపుల తరహాలో రాష్ట్రంలో ఇన్‌స్టంట్ బీర్ కేఫ్‌ల ఏర్పాటుకు కసరత్తు పూర్తిచేసింది. నగరంలో ప్రతి 5 కిలోమీటర్ల దూరంలో, గ్రామీణ జిల్లాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 30 కిలో మీటర్లకు ఒకటి చొప్పున మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం విదివిధానాలు రూపొందించింది. హైదరాబాద్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది కనీసం 100 మైక్రో బ్రూవరీలనైనా ఏర్పాటు చేసే దిశ గా ఔత్సాహిక వ్యాపారులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను నిర్దేశించినట్టు తెలిసింది. మైక్రో బ్రూవరీల లైసెన్స్ ఫీజు ప్రస్తుతం రూ. 3లక్షలు ఉండగా.. దాన్ని రూ. 5 లక్షలకు పెంచాలని నిర్ణయించినట్టు అధికారులు చెప్తున్నారు. తెలంగాణలో ప్రతి 13వేల మందికి ఒకటి చొప్పున కేఫ్ ఏర్పాటు చేసే విధంగా ఎక్సైజ్ నిబంధనలను సవరిస్తున్నట్టు తెలిసింది. తాజా తాజా బీరు: రాష్ట్రంలో ప్రస్తుతం ఆరు బ్రూవరీలు ఉన్నాయి. ఈ బ్రూవరీల నుంచి ఏటా 6,500లక్షల బీర్ కేసులు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో 2,500లక్షల కేసులు ఒక్క హైదరాబాద్ లోనే విక్రయిస్తున్నట్టు ఎక్సైజ్ నివేదికలు చెప్తున్నాయి. మైక్రో బ్రూవరీ నుంచి అప్పటికప్పుడు తయారై నేరుగా గ్లాసులోకే బీరు వచ్చేస్తుంది. కాగా, నివాస ప్రాంతాల్లో 1,000 లీటర్ల ఫ్రెష్ బీర్‌ను ఉత్పత్తి చేయగలిగి, విక్రయించే సా మర్థ్యం ఉన్నచోట మైక్రో బ్రూవరీలను అనుమితించేలా ని బంధనలు సవరిస్తున్నట్టు తెలుస్తుంది.

# సర్వేలపై సర్వేలు!

## - ఉక్కిరిబిక్కిరవుతున్న సచివాలయ ఉద్యోగులు
## - సంబంధం లేని శాఖల పనుల అప్పగింతతో తీవ్ర పని భారం



**గుంటూరు,తెలంగాణ దిశ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అనేక అంశాలపై క్షేత్ర స్థాయిలో సమాచారం తెలుసుకునేందుకు సచివాలయ ఉద్యోగులతో ఉన్నతాధికారులు పలు రకాల సర్వేలు చేయిస్తున్నారు. ఒక సర్వే పూర్తవ్వగానే మరో సర్వే బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో, ఉద్యోగులు క్షేత్ర స్థాయి సర్వేలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సచివాలయ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడం, ఇతర ప్రాంతాల బాధ్యతలు కూడా వారికే అప్పగించడంతో పనిభారం మరింత పెరిగింది. దీంతో, వివిధ ధ్రువపత్రాలు, ఇతర పనుల కోసం సచివాలయాలకు వచ్చే వారికి వారు అందుబాటులో ఉండలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 11 మంది, పట్టణ ప్రాంతాల్లో పది ఉద్యోగులతో గత ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఏడుగురు, పట్టణ ప్రాంతాల్లో ఆరుగురు మంది మాత్రమే ఉంటున్నారు. బ్యాంకర్లు తమ ఖాతాదారుల ఆధార్ లింక్, ఇకెవైసి బాధ్యతలను కూడా ఇటీవల సచివాలయాల ఉద్యోగులకు అప్పగించడం వివాదస్పదమైంది. ఈ పనిని బ్యాంకు ఉద్యోగులు చేయాల్సి ఉండగా వివిధ పథకాల కింద నిధులు జమ చేసే పేరుతో అధికారులు ఈ బాధ్యతలను తమకే అప్పగించారని సచివాయాల ఉద్యోగులు వాపోతున్నారు. ఐటి శాఖ చేయాల్సిన వర్క్ ఫ్రం హోం సిటిజన్స్ గుర్తింపు సర్వేనూ తమకే అప్పగించినట్టు చెబుతున్నారు. తాజాగా పి4 సర్వే మొత్తం సచివాలయాలకు అప్పగించారు. పరిశ్రమల శాఖ నిర్వహించాల్సిన ఎంఎస్‌ఎంఇ సంస్థల గుర్తింపును తమకే అప్పగించారని సచివాలయాల ఉద్యోగులు వాపోతున్నారు. తుపాన్లు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా హౌస్ హోల్డ్ మ్యాపింగ్, వ్యక్తుల నివాసిత గుర్తింపు వివరాల నమోదుకు ఇంటి ఫొటోలు, జియోట్యాగింగ్ బాధ్యతలు ఇటీవల సచివాలయాల ఉద్యోగులు పూర్తి చేశారు. నేషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చిన్నారులను గుర్తించే, ఆధార్‌లో నమోదు చేయించే బాధ్యతలను కూడా వారికే అప్పగించారు. చర్మకారులకు పలు పథకాల అమలుకు లబ్ధిదారులను గుర్తించడం, పింఛనుదారుల్లో అనర్హుల గుర్తింపునకు వారికి నోటీసులు జారీ చేయడం, వికలాంగులను తిరిగి వైద్య పరీక్షలకు పంపడం తదితర పనులను సచివాలయ ఉద్యోగులతోనే చేయిస్తున్నారు. సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూటీకరణలో భాగంగా రైతులకు ఇకెవైసి చేయాల్సిన సంబంధిత శాఖ ఉద్యోగులకు కాకుండా ఈ పని కూడా సచివాలయాల ఉద్యోగులకే అప్పగించారు. సిటిజన్ గుర్తింపు గుర్తింపు సర్వే మున్సిపల్, గ్రామ పంచాయతీలు చేయాల్సి ఉండగా ఈ పని కూడా సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. రైతులకు సంబంధించిన భూ ఆధార్ నమోదును సచివాలయాల్లోని వ్యవసాయ సహాయకుడికి అప్పగించారు. బియ్యం కార్డుల్లోని సభ్యులు ఇకెవైసి బాధ్యతను విఆర్ఒ చేయాల్సి ఉండగా, ఈ పని కూడా తమకే అప్పగించారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వలంటీర్లు చేసిన ప్రతి పనినీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించారు. వివిధ శాఖల ఉద్యోగులు చేయాల్సిన అన్ని పనులనూ తమకే అప్పగిస్తున్నారని, దీనివల్ల సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఉద్యోగులు అందుబాటులో ఉండలేకపోతు న్నారని,.తద్వారా పౌర సేవల్లో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని సచివాలయాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.అంకమ్మరావు తెలిపారు. మున్సిపాలిటీల్లో, మండల పరిషత్తుల్లో అనేకమంది ఉద్యోగులు ఉన్నా ప్రతి పనికీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించేస్తున్నారని ఆయన చెప్పారు.

# భారీగా పెరుగుతున్న ఇళ్ల అద్దెలు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది.హైదరాబాద్.. తెలంగాణ రాజధాని. విశ్వనగరంగా గుర్తింపు పొందింది. పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించడ ంతో ఇక్కడికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. దీంతో తెలంగాణ తోపాటు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉద్యోగులు హైదరాబాద్‌లో స్థిరపుతున్నారు. కొందరు అద్దెకు ఉంటుండగా, కొందరు ఇళుల కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లు మరియు ఉన్నత స్థాయి రెసిడెన్షియల్ ప్రాంతాలైన గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.

సాధారణంగా, హైదరాబాద్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల ధరలు స్థిరంగా పెరుగుతున్నాయి. 2024లో ఒక స్క్వేర్ ఫీట్ ధర సగటున రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు ఉండగా, 2025 నాటికి ఇది కొన్ని ప్రాంతాల్లో రూ. 11 వేల నుంచి రూ. 12,500 దాటింది. దీనికి ప్రధాన కారణాలు ఐటీ రంగ విస్తరణ, మెరుగైన మౌలిక సదుపాయాలు, నగరంలోకి వలస వచ్చే జనాభా పెరుగుదల.అద్దెల విషయానికొస్తే, హైదరాబాద్‌లో అద్దె ధరలు కూడా పెరిగినప్పటికీ, ఇళ్ల ధరలతో పోలిస్తే అవి నిష్పత్తిలో తక్కువ వేగంతో పెరుగుతున్నాయి. గచ్చిబౌలిలో 2 ఃఊఐ అపార్ట్‌మెంట్ అద్దె సగటున రూ. 25 వేల నుంచి రూ. 35 వేల వరకు ఉంటే, అదే ప్రాంతంలో ఇంటి కొనుగోలు ధర రూ. 80 లక్షల నుంచి రూ. 1.2 కోట్ల వరకు ఉంటోంది. దీని ఫలితంగా, రెంటల్(అద్దె ద్వారా వచ్చే ఆదాయం శాతం) సగటున 4?5% వద్ద ఉంటోంది, ఇది ఇళ్ల ధరల పెరుగుదలతో సమానంగా లేదు.ఈ పరిస్థితి కొనుగోలుదారులకు ఒక సవాలుగా మారుతోంది, ఎందుకంటే అద్దెకు ఇళ్లు తీసుకోవడం కంటే కొనడం ఖరీదైన ఎంపికగా మారింది. అయితే, ఈ ధరల పెరుగుదల నగర ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులకు ఇది ఇప్పటికీ ఆకర్షణీయమైన ప్రాంతంగా ఉందని సూచిస్తోంది.

# మైహోం విహంగ ముందు ఎన్ఎస్యూఐ అందోళన!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మైహోం విహంగ వద్ద ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, విద్యార్థి నాయకులు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేపారు. బల్మూరీ వెంకట్ మాట్లాడుతూ హెచ్సీయూ పై బీజేనీ, బీఆర్ఎస్ పార్టీలు లేని ప్రేమ నటిస్తున్నాయి. కంచె గచ్చిబౌలి లో సర్వే 25లో 2004 లో 534 ఎకరాలు ప్రభుత్వానికి ఇస్తున్నట్టు హెచ్సీయూ రిజిస్ట్రార్ సంతకం చేశారు. బదులుగా ప్రభుత్వం 397 ఎకరాలు ఇస్తున్నట్టు సంతకం చేశారు. 534 లో 400 ఐఎఉంజీభారత్ కు 120 ఎకరాలు, ఉద్యోగ సంఘాలకు కేటాయించారు. ఐఎఉంజీ భారత్ ఒప్పందం ప్రకారం వ్యవహరించలేదు.. భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళకుండా ప్రభుత్వం న్యాయ పోరాటం చేసింది. 400ఎకరాలు ప్రభుత్వ భూమిగా కోర్టుల్లో కొట్లాడి సాధిం చాం.భూములు ప్రైవేట్ వ్యక్తులకు చెందాలని కొందరు భావించారు. ఈ 25 సర్వే నంబర్ లోనే బీఆర్ఎస్ అధికారంలో మై హోం విహంగ కు 25 ఎకరాలు కట్టబెట్టారు. ఇక్కడ పెద్ద భవనాలు నిర్మించారు... రెండు భవనాలకే వంద ఫీట్ల రోడ్డు వేశారు. ఉద్యోగ సంఘాలకు కేటాయించిన భూమిలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తప్పుడు పేర్లతో 20 ఎకరాలు ఆక్రమించే ప్రయత్నం జరిగింది. ఆ 20 ఎకరాలు ప్రభుత్వం గుంజుకుంటుందన్న భయంతో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతున్నాడు.

# పెద్ది ఫస్ట్ సింగిల్ ఆలస్యానికి కారణం ఏంటి..




ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన 'గేమ్ ఛేంజర్' సినిమాతో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రేక్షకుల ముందుకు వచ్చి, ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయినప్పటికీ, ఇప్పుడు ఆయన పూర్తి స్థాయిలో తన కొత్త ప్రాజెక్ట్ 'పెద్ది'పై దృష్టి సారించారు. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా, పాన్ ఇండియా లెవల్లో రూపొందుతోంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రారంభం నుంచి భారీ అంచనాలున్నాయి. ఈ అంచనాలకు తగ్గట్లుగానే మేకర్స్ ప్రతీ చిన్న అప్‌డేట్‌ను ఎంతో కేర్‌ఫుల్‌గా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ అన్నీ ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను రాబట్టాయి. ఇక ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నది ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్, ఆయన మ్యూజిక్ ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్ అని చెప్పడంలో సందేహమేలేదు. మేకర్స్ ఇప్పటికేఈ విషయాన్నిస్పష్టంగా తెలియజేశారు. మూవీ నుండి విడుదల కానున్న ఫస్ట్ సింగిల్‌పై కూడా భారీ అంచనాలున్నాయి. దసరా సందర్భంగా ఈ పాటను రిలీజ్ చేస్తారని ఊహాగానాలు వెల్లువెత్తాయి. కానీ పాట విడుదల కాలేదు. తాజా సమాచారం ప్రకారం, పెద్ది ఫస్ట్ సింగిల్ పూర్తిగా రెడీగా ఉన్నప్పటికీ, దానికి సంబంధించిన కొన్ని విజువల్స్‌ను షూట్ చేసి, లిరికల్ వీడియోలో యాడ్ చేసిన తరువాతే విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారట అందుకే దసరాకు పాట విడుదల చేయకుండా ఆ నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. ఈ పాట ఒక మంచి లవ్ ట్రాక్ అని, రెహమాన్ దాన్ని ఎంతో ఫ్రెష్‌గా కంపోజ్ చేశారని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి.ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్నదిగా ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా, జగపతిబాబు, శివరాజ్‌కుమార్ లాంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అన్ని బలమైన అంశాలతో రూపొందుతున్న 'పెద్ది' సినిమా, 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతున్న ఈ సినిమా, రామ్ చరణ్‌కు మరొక బ్లాక్‌బస్టర్‌ను తెచ్చిపెడుతుందా అన్నది ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# రావిపూడి అనిల్ తో నవీన్ సినిమా ఫైట్





ఒక సినిమా తీసి సక్సెస్ ని సాధించాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని ఎందుకంటే ఆ సినిమా కథ ఏ జానర్ కి చెందిందిఆ సినిమాను ప్రేక్షకుడికి నచ్చేట్టుగా ఎలా చేయాలి అని దర్శకుడు అనునిత్యం మథనపడుతూ ఒక బెస్ట్ ప్రొడక్ట్ ఇవ్వడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తాడు. ఇక ఇలాంటి సందర్భంలోనే ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం ఒక బెస్ట్ సినిమాను ప్రేక్షకులకు అందించడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. ఈయన సినిమా సినిమాకిమధ్య చాలా ఎక్కువ గ్యాప్ తీసుకుంటాడు. తక్కువ సినిమాలు చేసిన కూడా ప్రేక్షకుడికి నచ్చే సినిమాలు చేయాలనే ఆయన ముందుకు సాగుతున్నాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ', 'జాతి రత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' లాంటి సినిమాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. సంక్రాంతి కానుకగా జనవరి 14వ తేదీన ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే దసర పండుగను పురస్కరించుకొని అనగన గా ఒక రాజు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ని చేపట్టారు. నవీన్ పోలిశెట్టి గోదారి గట్టున నడుచుకుంటూ వెళ్తుంటే కొంతమం ది ప్రేక్షకులు అతన్ని కలిసి ఏం బాబు ఇలా వెళ్తున్నావు నీ ఫేస్ బ్రైట్‌గా వెలిగిపోతుంది అని అడగగా, మన సినిమా గురించి మీకు తెలుసు కదా అని నవీన్ పోలిశెట్టి అడుగుతాడు. వాళ్లు మాకెందుకు తెలియదు 'అనగనగా ఒక రాజు' అంటూ సినిమా టైటిల్ ని చెప్పేసారు. సినిమా కోసం మేమంతా వెయిట్ చేస్తున్నామంటూ వాళ్ళు చెప్పిన మాటలతో ఇంప్రెస్ అయిన నవీన్ పోలిశెట్టి వాళ్ళందరికి టికెట్లనుఫ్రీగా ఇస్తున్నాను అంటూ ప్రకటించారు.దాంతో తనసినిమాని చాలా డిఫరెంట్ వేలో ప్రజెంట్ చేస్తున్నాడంటూ అలాగే ప్రమోషన్స్ భారీ లెవెల్లో చేస్తున్నాడు అంటూ సోషల్ మీడియా లో కొన్ని కథనలైతే వెలువడుతున్నాయి. ఇక ఇంతకుముందు అనిల్ రావిపూడి లాంటి దర్శకుడు సైతం 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు భారీగా ప్రమోషన్స్ చేపట్టి సినిమాను జనాల్లోకి తీసుకెళ్లి సూపర్ సక్సెస్‌ని సాధించాడు.ఇప్పుడు ఈ సినిమాని సైతం ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడానికి విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇక ఈ క్రమంలోనే నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం అనిల్ రావిపూడి కి గట్టిపోటీ ఇస్తు ప్రమోషన్స్ చేపట్టడం అనేది నిజంగా చాలా గొప్ప విషయం అంటూ చాలా మంది సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తుండటం విశేషం



## ప్రభాస్ 'ది రాజాసాబ్' డబ్బింగ్ షురూ.!

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది రాజా సాబ్. మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జనవరి 09న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి డబ్బింగ్ పనులు మొదలుపెట్టింది చిత్రయూనిట్. ఈ విషయాన్ని చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది.

# సినిమా..

## సినిమా హబ్‌లో మల్టీప్లెక్స్‌ల హడావిడి..



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సినిమా లవర్స్‌కు శుభవార్త. దశాబ్దాలుగా సింగిల్ స్క్రీన్‌లకు కేంద్రమైన ఈ ప్రాంతంలో ఇప్పుడు రెండు అత్యాధునిక మల్టీప్లెక్స్‌లు రాబోతున్నాయి. ఓడియన్ మల్టీప్లెక్స్ (8 స్క్రీన్‌లు) అక్టోబర్ 24, 2025న.. ఆ తర్వాత సంక్రాంతి 2026కి ఏఎంబీ క్లాసిక్ (7 స్క్రీన్‌లు) ప్రారంభమవుతాయి. మహేష్ బాబు భాగస్వామ్యంతో వస్తున్న ఏఎంబీ క్లాసిక్, సుదర్శన్ థియేటర్ స్థానంలో రూపుదిద్దుకుంది. ఈ కొత్త మల్టీప్లెక్స్‌లతో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ఇక 25 స్క్రీన్‌ల వినోద కేంద్రంగా మారుతుంది.మూవీ లవర్స్ కు ఇది శుభవార్త అనే చెప్పాలి. తెలుగు సినిమాకు ఎప్పుడూ గుండెకాయ లాంటి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతం ఇప్పుడు కొత్తరూపు సంతరించుకుంటోంది. దశాబ్దాలుగా ఎన్నో బాక్సాఫీస్ రికార్డులకు వేదికైన ఈ ప్రాంతంలో.. మొన్నటి వరకు కేవలం పాత తరహా సింగిల్ స్క్రీన్ థియేటర్లు మాత్రమే ఉండేవి.

కానీ.. ఇప్పుడు ఆ సంస్కృతి పూర్తిగా మారిపోతోంది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఒకేసారి రెండు అత్యాధునిక మల్టీప్లెక్స్‌లు రాబోతున్నాయి. హైదరాబాద్‌లో సినిమా అంటే గుర్తొచ్చే సంధ్య, దేవి, సుదర్శన్ వంటి ఐకానిక్ థియేటర్లకు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ చాలా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో సుమారు 18 థియేటర్లు ఉండేవి. వీకెండ్‌లో కొత్త సినిమాల సందడితో ఈ ప్రాంతమంతా కిటకిటలాడేది. ఇప్పుడు ఆ పాత జ్ఞాపకాలకు మల్టీప్లెక్స్ మెరుగులు దిద్దుతున్నారు. 1. ఓడియన్ మల్టీప్లెక్స్ ప్రారంభం: ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన ఓడియన్ సింగిల్ స్క్రీన్ థియేటర్ స్థానంలో.. ఇప్పుడు అత్యంత విలాసవంతమైన ఓడియన్ మల్టీప్లెక్స్ రూపుదిద్దుకుంది. సినీ ప్రియుల కోసం తన తలుపులు తెరుస్తుంది. ఇందులో 8 స్క్రీన్‌లు ఉంటాయి. సినిమా చూసే అనుభవాన్ని పెంచడానికి అత్యాధునిక ప్రొజెక్షన్, సౌకర్యవంతమైన లగ్జరీ సీటింగ్‌ను ఏర్పాటు చేశారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం కల్పించారు. సినిమా హాల్‌తో పాటు, అందులోనే షాపింగ్ మాల్ కూడా ఉంది. దీంతో ప్రజలు ఒకేచోట సినిమాలు చూస్తూ, షాపింగ్ చేసుకునే అవకాశం లభిస్తుంది. 2. సంక్రాంతికి ఏఎంబీ క్లాసిక్: ఓడియన్ ప్రారంభమైన వెంటనే.. సంక్రాంతి 2026 సందర్భంగా మరో భారీ మల్టీప్లెక్స్ రాబోతోంది. అదే.. ఏఎంబీ క్లాసిక్. ఇది పాత సుదర్శన్ 70ఓఓ థియేటర్ ఉన్న చోట నిర్మిస్తున్నారు. సూపర్‌స్టార్ మహేష్ బాబుకు హైదరాబాద్‌లో ఇది రెండవ మల్టీప్లెక్స్ వెంచర్ కావడం విశేషం. ఏఎంబీ క్లాసిక్‌లో మొత్తం 7 స్క్రీన్‌లు ఉంటాయి. ఈ మల్టీప్లెక్స్‌లో విడుదల కానున్న మొట్టమొదటి పెద్ద సినిమా 'ది రాజా సాబ్' అయ్యే అవకాశం ఉంది. పీవీఆర్, ఐనాక్స్ వంటి పెద్ద కంపెనీల పోటీని ఏఎంబీ క్లాసిక్ ఎలా ఎదుర్కొంటుందో అని సినీ అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ రెండు మల్టీప్లెక్స్‌లు అందుబాటులోకి వస్తే.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని స్క్రీన్‌ల సంఖ్య 18 నుంచి 25కు పెరుగుతుంది. అయితే.. ఈ ప్రాంతంలోని కొంతమంది విద్యార్థులు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకు లు వీటి వల్ల ట్రాఫిక్ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని.. ఇక్కడ భూమి ధరల పెరుగుదల వల్ల అద్దెలు ఎక్కువవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంమీద.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఈ మార్పు సినీ పరిశ్రమకు, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది.

# నిరుద్యోగమే నిరసనలకు కారణమా?

**భారత్ పొరుగు దేశమైన నేపాల్ మాదిరిగానే లడఖ్ యువత ఇటీవల పెద్ద ఎత్తున నిరసన బాటపట్టారు. ఈ నిరసనల్లో పోలీసుల కాల్పుల్లో నలుగురు ప్రాణాల్ని సైతం కోల్పోయారు. కేవలం కొన్ని లక్షల మంది ఉన్న లడఖ్‌లో నిరసనలు జరగడానికి కారణం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమా కాదని బిజెపి వారిస్తోంది. మరేంటి కారణం.. అంటే నిరుద్యోగమే ప్రధాన కారణమని తెలుస్తోంది. లడఖ్ వివరాల్లోకి వెళితే..**



హెచ్చుస్థాయిలోనే అక్షరాస్యత..: లడఖ్‌లో ఉన్నది మూడు లక్షల జనాభానే. అక్కడ హిందువులు, ముస్లింలు, బౌద్ధ మతస్తులు ఉన్నారు. 90 శాతం గిరిజనులే. లడఖ్‌లో జాతీయ విద్యా పథకాలు మాత్రం పేలవంగానే అమలవుతున్నా.. అక్షరాస్యత శాతం ఎక్కువగానే ఉంది. పురుషులు 89 శాతం, మహిళలు 65 శాతం మంది అక్షరాస్యులున్నారు. ఇక్కడ ఉపాధ్యాయుల తరచూ బదిలీలతో పట్టణం వెలుపల ప్రాథమిక సెకండరీ స్థాయి విద్యా బోధనలు అంతంత మాత్రమనే చెప్పుకోవచ్చు. అయినప్పటికీ అక్కడ చిన్నారులు, తల్లిదండ్రులు చదువుకు ప్రాధాన్యమిస్తుండడం గమనార్హం.

వ్యవసాయం..: దాదాపుగా ఇక్కడ వర్షపాతం ఉండదు. పంటలు హిమనదీయ కరిగే నీటి కాలువలు, బుగ్గలు మీదే పంటలు పండుతాయి. సింధు నదీ లోయలలో దాని ఉపనదులపైనే గ్రామస్తులు ఆధారపడతారు. వారు ఎక్కువగా బార్లీ, గోధుమలు, బఠానీలను పడిస్తారు. పండ్లలో నేరేడు, ఆపిల్స్‌ని పండిస్తారు. మరోవైపు పశువుల పెంపకందారులు పాడి, ఉన్నిలను ఉత్పత్తి చేస్తారు. మేక ఫైబర్‌లను వీరు కాశ్మీర్‌కు వర్తకం చేస్తారు. అయితే లడఖ్‌వాసులు ఆధునిక యంత్రాలతో వ్యవసాయం చేయడానికి మాత్రం విముఖత చూపుతున్నారు.

టూరిజం..: హిమాలయ పర్వతాలు, పాంగోంగ్ సరస్సు హొయలు, లోయలు.. అక్కడ సంస్కృతి, సంప్రదాయాలు పర్యాటకుల్ని కనువిందు చేస్తాయి. లడఖ్ ప్రధాన ఆర్థిక వనరు పర్యాటకమే. 1974 నుంచే ఇక్కడ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతోంది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వాలు ఈ రంగంలోనే వేలాదిమందికి ఉద్యోగ అవకాశాల్ని కల్పించాయి. ఇక్కడికి యూరోపియన్, అమెరికన్లు, భారతీయులు ఎక్కువమంది వస్తారు. ఇక్కడి పర్యావరణం పర్యాటకుల్ని ఆకర్షిస్తున్నా.. మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవు. విపరీతంగా నీటికొరత ఉంది. హిమాలయ పర్వతాల నుంచి కరిగే నీటిపైనే ఆధారపడడం.. పైపెచ్చు.. ఎక్కడికక్కడ ఆనకట్టల ద్వారా దిగువకు నీరు లేకపోవడంతో.. అక్కడ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఉష్ణోగ్రతల్లో మార్పులు కారణంగా వేసవిలో మంచు పర్వతాలు విపరీత స్థాయిలో కరుగుతున్నాయి. దీంతో శీతాకాలంలో నీటి సమస్య లేకపోయినా.. వేసవిలో మాత్రం నీటి కోసం అల్లాడుతున్నారు. సమ్మర్‌లోనే పర్యాటకుల రద్దీ ఎక్కువ. ఆ సమయంలోనే నీటి కొరత వల్ల పర్యాటకుల సంఖ్య కూడా తగ్గుముఖం పడుతుంది. ఇది వారి జీవనాధారంపైనే ప్రభావం చూపుతుంది. నిరుద్యోగం..: 2021–22లో 534 నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలకు 50 వేల దరఖాస్తుల్ని పంపారు. అంటే ఒక ఉద్యోగానికి ఆరుగురు పోటీ పడుతున్నారన్నమాట. ఈ విషయాన్ని స్వయంగా సబార్డినేట్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. 2021–22లో లడఖ్ నిరుద్యోగం 9.8 శాతం. అదే 2022–23కి 26.5 శాతానికి చేరిందని పార్లమెంటు సమావేశాల సందర్భంగా 2023లో రాజ్యసభలో ఎంపీలే వెల్లడించారు. ఇది జాతీయ సగటు నిరుద్యోగ రేటు 2021–22 14.9 శాతం, 2022–23 లో 13.4 శాతానికంటే ఎక్కువ.

సమస్యను పక్కదోవ పట్టించిన మీడియా: జాతీయ మీడియా మాత్రం అసలు సమస్యను పక్కకు నెట్టేసింది. ఇటీవల కాలంలో మీడియా ఏకాడికి లడఖ్ నిరసనల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ పుంట్సోగ్ స్టాంజిత్ తెపాగ్ పాల్గొనడాన్నే హైలెట్ చేసింది. పూర్తిగా బిజెపికి వత్తాసునిచ్చింది. నిరసనలకు ముందు ఉద్యమకారుడు వాంగ్‌చుక్ నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక నిరసనల గురించి ప్రసంగించారని.. ఆయన ఆయా దేశాల యువత చేపట్టిన నిరసనల్ని హైలెట్ చేయడం వల్లే బిజెపి కార్యాలయానికి ఆందోళనకారులు నిప్పుపెట్టారని బిజెపి నేతలు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇంత పెద్దఎత్తున నిరసనలు జరగడానికి కారణం.. కాంగ్రెస్ పార్టీ, కౌన్సిలర్ పుంట్సోగ్ నిరసనకారుల్ని రెచ్చగొట్టడం వల్లే జరగాయని బిజెపి ఆరోపిస్తోంది.

అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నట్లు ప్రత్యేక రాష్ట్ర హోదా కానీ.. ఆ డిమాండ్ తలెత్తడానికి గల కారణాల్ని కానీ మీడియా పట్టించుకోవడం లేదు. ఇదెంత దారుణం లడఖ్ జమ్మూకాశ్మీర్ కిందకే వస్తుంది. అధికారిక లెక్కల ప్రకారం 1995 నుంచి సొంతంగా కౌన్సిల్ పాలన సాగుతుంది. 2019 ఆగస్టు 5న జమ్మూకాశ్మీర్‌కి ప్రత్యేక హోదా రద్దు చేయడంతో.. లడఖ్ వాసులు ప్రత్యేక రాష్ట్ర హోదా కోసం డిమాండ్ చేయడం ప్రారంభించారు. గిరిజనుల కోసం ప్రత్యేక అధికారాలు కలిగిన 6వ షెడ్యూల్ కిందకి లడఖ్‌ని తీసుకురావాలని వారు నినదిస్తున్నారు. 6వ షెడ్యూల్ ద్వారా..

జిల్లా కౌన్సిల్‌లు, శాసన, న్యాయ పరిపాలన స్వయం ప్రతిపత్తిని కలిగి ఉంటాయి. అక్కడి భూమి.. పరిపాలనా, చట్టాలు అన్నీ వారి అధీనంలోకి వస్తాయనే కారణంతోనే లడఖ్ ప్రజలు రాష్ట్ర హోదా కోసం నిరసనలు చేస్తున్నారు. ఇక్కడి చైనా సరిహద్దు ప్రాంతంగా ఉందని.. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215